లక్ష్యం సమస్యమీది..! పరిష్కారం మాది..!
'లక్ష్యం దిన పత్రిక' పాఠకుల అభిరుచి మేరకు ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది.
మీ ప్రాంత అభివృద్ధి నేపధ్యంలో వెనుకబాటుతనానికి కారణాలు ఫోటోతో ఒక చిన్న కామెంట్ పెడితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆయా ప్రాంత 'లక్ష్యం' పాత్రికేయ బృందం పరిశీలించి వార్త రూపంలో పత్రికాముఖంగా సమస్యను రాజకీయ, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తుంది.
ప్రజాచైతన్యమే లక్ష్యం గా ....
మీ ముందుకు వస్తున్నది. ఇంక ఎందుకు ఆలస్యం..!
సంప్రదించవలసిన మొబైల్ నెంబర్స్:
కె. శ్యామ్
రీజనల్ మేనేజర్,
సెల్: 63042 20819
లక్ష్యం గ్రూప్ ఆఫ్ మీడియా

ప్రజా చైతన్యమే...
# లక్ష్యం
తెలుగు దినపత్రిక

లక్ష్యం విలేఖరులు కావలెను లక్ష్యం TV NEWS
లక్ష్యం దిన పత్రిక 13 వసంతాలు పూర్తిచేసుకొని14 వ వసంతంలో అడుగిడిన నేపధ్యంలో " తెలుగు రాష్ట్రాల్లో అపార అభిమానం పొంది ఎందరో పాఠకుల మానస పుత్రికగా వెలుగొందుతున్న లక్ష్యం తెలుగ దిన పత్రికకు"
తెలుగు రాష్ట్రాల్లో జిల్లా వారీగా బ్యూరో ఇంచార్జీలు కావలెను.
లక్ష్యం మాస పత్రికకు & లక్ష్యం టీవి కి జిల్లాలవారీగా బ్యూరో ఇంచార్జీలు కావలెను.
కె. శ్యామ్
రీజనల్ మేనేజర్,
సెల్: 63042 20819
లక్ష్యం గ్రూప్ ఆఫ్ మీడియా

ఎడిటర్ ఇన్ చీఫ్-మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010
Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.
సంపుటి:1 సంచిక:355 బుధవారం 18-2-2026 పేజీలు : 8 వెల: 3/-

LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only

## ముంబైలో ఫ్రెంచ్ అధ్యక్షుడు మాక్రాన్‌తో
# ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు..

**(ముంబై నుంచి)**

ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం నాడు ముంబైలోని మహారాష్ట్ర లోక్ భవన్‌లో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.లోక్ భవన్‌లో చర్చలు ప్రారంభించే ముందు ఇరువురు నాయకులు హృదయపూర్వకంగా ఆలింగనం చేసుకున్నారు, ఇది భారతదేశం-ఫ్రాన్స్ సంబంధాల యొక్క సన్నిహిత వ్యక్తిగత సంబంధాన్ని మరియు వ్యూహాత్మక లోతును చెబుతుంది. సమావేశం తర్వాత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, "నా స్నేహితుడు, అధ్యక్షుడు మాక్రాన్‌ను ముంబైలో కలవడం చాలా ఆనందంగా ఉంది! తనకు ఈ నగరం నిజంగా ఇష్టమని, ఆ రోజు తన పరుగును కూడా ఆస్వాదించానని ఆయన నాకు చెప్పారు!" అని అన్నారువిదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ భారతదేశం-ఫ్రాన్స్ సంబంధాలను "అందమైన భాగస్వామ్యం"గా అభివర్ణించారు, ఇది 2 దేశాల మధ్య విస్తృత సహకారాన్ని ఎక్కువ చేస్తుంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు మరియు పరిశోధనలలో సహకారాన్ని మరింతగా పెంచే లక్ష్యంతో నాయకులు "ఇన్నోవేషన్ ఇయర్ 2026"ను ప్రారంభిస్తారని ఆయన అన్నారు."డిజిటల్ టెక్నాలజీ, ఆవిష్కరణ, విద్యార్థుల చైతన్యం, సంస్కృతి, రక్షణ, భద్రత మరియు పర్యావరణ అనుకూల మార్గాల్లో భారతదేశం మరియు ఫ్రాన్స్ మధ్య చాలా జరుగుతోంది. ఈ అంశాలన్నీ చర్చకు వస్తాయి" అని రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.ముంబైలో వారి నిశ్చితార్థాల తర్వాత, ఇద్దరు నాయకులు భారత్ మండపంలో జరిగే ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పాల్గొనడానికి న్యూఢిల్లీకి వెళ్లనున్నారు. పీపుల్, ప్లానెట్ మరియు ప్రోగ్రెస్ అనే



స్తంభాలపై ఆధారపడిన ఈ సమ్మిట్, గ్లోబల్ సౌత్‌లో నిర్వహించబడుతున్న మొదటి గ్లోబల్ ఏఐ ఈవెంట్.ఫిబ్రవరి 2025లో పారిస్‌లో జరిగిన ఏఐ యాక్షన్ సమ్మిట్‌కు ప్రధాని మోదీ అధ్యక్షత వహించినప్పటి నుండి, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో ఫ్రాంకో-ఇండియన్ సహకారాన్ని బలోపేతం చేయడంతో, ఈ శిఖరాగ్ర సమావేశంలో మాక్రాన్ పాల్గొనడం ఊపందుకుంది.అధ్యక్షుడు మాక్రాన్ సోమవారం సాయంత్రం ముంబై చేరుకున్నారు మరియు ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవవ్రత్ మరియు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆయనకు స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే మరియు సునేత్రా పవార్ కూడా హాజరయ్యారు.మాక్రాన్‌ను భారతదేశానికి స్వాగతిస్తూ, ప్రధాని మోదీ ముందుగా ఏలో పోస్ట్ చేస్తూ, ఈ పర్యటన "మా ద్వైపాక్షిక సంబంధాలను కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని" మరియు ప్రపంచ పురోగతికి దోహదపడుతూనే రంగాలలో సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందని తాను విశ్వసిస్తున్నానని అన్నారు. తెల్లవారుజామున, మాక్రాన్ భద్రతా సిబ్బందితో కలిసి స్థానిక నివాసితులతో కలిసి జాగింగ్ చేయడం ద్వారా ముంబైకర్లను ఆశ్చర్యపరిచాడు. నేవీ బ్లూ టీ-షర్ట్ మరియు సన్ గ్లాసెస్ ధరించి, కిక్కిరిసిన దౌత్య షెడ్యూల్ కంటే ముందే అతను తన ఫిట్‌నెస్ దినచర్యను కొనసాగించాడు.

# విశాఖకు చేరుకున్న రాష్ట్రపతి

**విశాఖ (లక్ష్యం న్యూస్)**

విశాఖ పట్నానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేరుకున్నారు. 2 రోజుల పర్యటనలో భాగంగా ఆమె విశాఖ నేవల్ ఎయిర్ స్టేషన్ డేగాకు ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి రాష్ట్రపతి కి స్వాగతం పలికారు.విశాఖపట్నంలో జరుగనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ( ఐఎఫ్ఆర్)లో పాల్గొనేందుకు రాష్ట్రపతి విశాఖకు చేరుకున్నారు. బుధవారం నాడు జరుగనున్న కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు రాష్ట్ర గవర్నర్,



డిప్యూటీ సీఎం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ తదితరులు హాజరు కానున్నారు.

## కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులకు
# అండగా నిలుస్తోంది

**- ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ. 1.50కే విద్యుత్**
**- యూనిట్ కు రూ.2.35 సబ్సిడీని కూటమి ప్రభుత్వం భరిస్తోంది**
**- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్**

**అమరావతి:(లక్ష్యం న్యూస్)**

తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులకు ఎల్లవేళలా అండగా నిలుస్తోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఆక్వా రైతులకు ఒకే రకమైన విద్యుత్ సబ్సిడీ అమలుపై అసెంబ్లీలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమగ్ర సమాధానం ఇచ్చారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆక్వాకల్చర్‌కు విద్యుత్ సబ్సిడీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ఆక్వాకు సంబంధించి జోన్ నాన్ జోన్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను ఫిషరీస్ శాఖ సమగ్రంగా నిర్వహించిందని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి లోపాలు లేవని స్పష్టం చేశారు. ఏపీఈఆర్సీ ఆదేశాల ప్రకారం ఆక్వాకల్చర్‌కు యూనిట్‌కు రూ. 3.85 వసూలు చేయాల్సి ఉన్నప్పటికీ... ఆక్వా రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం రూ. 2.35 సబ్సిడీ భారం భరిస్తూ యూనిట్‌ను కేవలం రూ. 1.50



కే అందిస్తున్నదని మంత్రి తెలిపారు.గత ప్రభుత్వంలో నోటిఫైడ్ ఆక్వాకల్చర్ జోన్ పేరుతో కేవలం పది ఎకరాలకే పరిమితం చేశారని మంత్రి గొట్టిపాటి అసెంబ్లీ వేదికగా సభ్యులకు వివరించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ పరిమితులను సవరించి రైతులకు అనుకూల నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే 50 వేల అదనపు ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 5 లక్షల 21 వేల మంది ఆక్వా రైతులు యూనిట్‌కు రూ. 1.50 చెల్లిస్తూ సబ్సిడీ ప్రయోజనం పొందుతున్నారని మంత్రి తెలిపారు. ఆక్వా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను రీకాల్ చేయాలి : స్పీకర్



అమరావతి:(లక్ష్యం న్యూస్) రాష్ట్రంలో విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో మాట్లాడిన ఆయన..ఎమ్మెల్యేలు శాసనసభకు రావడం విధి అని గుర్తుచేశారు. కొందరు అసలు సభకే రాకుండా జీతభత్యాలు తీసుకుంటున్నారని, ఇలా చేయడం సరికాదని సున్నితంగా హెచ్చరించారు. ఉద్యోగులు ఉన్న సెలవులకంటే ఎక్కువ తీసుకుంటే జీతాలు కట్ చేసినట్లే.. ఎమ్మెల్యేలకు కూడా ఆ నిబంధనను ఎందుకు వర్తింపచేయకూడదన్నారు. ఈ అంశాలపై జాతీయస్థాయిలో చర్చించాలని, ప్రస్తుతం 8 దేశాల్లో ఈ నిబంధన ఉందని తెలిపారు. రీసెంట్ గా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన డిజిటల్ అటెండెన్స్ బాగా పనిచేస్తోందని అయ్యన్న తెలిపారు. సభలో ఎవరు ఎంతసేపు ఉన్నారన్నది కూడా అందులో రికార్డు అవుతోందని పేర్కొన్నారు.ఫిబ్రవరి 11న ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో మొదలైన విషయం తెలిసిందే. తొలిరోజు సభకు జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలు 11 మంది అసెంబ్లీకి హాజరయ్యారు. సరిగ్గా 11 నిమిషాలే ఉండి వెళ్లిపోవడంతో.. ఆ రోజు కూడా అయ్యన్న వారిపై అసెంబ్లీ లాబీలో సెటైర్లు వేశారు. తాజాగా ఎమ్మెల్యేల అటెండెన్స్ పై చేసిన వ్యాఖ్యలు కూడా వైసీపీ ఎమ్మెల్యేలను ఉద్దేశించినవేనని తెలుస్తోంది.

## రూ. 194 కోట్లతో ..
# 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణం

**-976 పీహెచ్సీ భవనాలకు రిపేర్లు చేపట్టాం**
**-వైద్యసేవల బలోపేతానికి 2500 డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది నియామకం**
**-వ్యక్తి ఆధారిత సేవలకోసం 'సంజీవని' ని సీఎం తీసుకొచ్చారు**
**-శాసన మండలిలో మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడి**

**అమరావతి(లక్ష్యం న్యూస్)**

రాష్ట్రంలో రూ. 194 కోట్ల వ్యయంతో 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పిహెచ్‌సిలు) నిర్మాణం జరుగుతోందని వైద్యారోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 1144 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పిహెచ్‌సిలు) పనిచేస్తున్నాయని, వాటికి సొంత భవనాలున్నాయని మంత్రి తెలిపారు. మరో 88 పీహెచ్సీలను మంజూరు చేశామని, వాటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. శాసన మండలిలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలకు సంబంధించి పలువురు సభ్యులడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. 12 పీహెచ్సీలకు కొత్త భవనాలు అవసరమని గుర్తించామని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ పేదలకు విస్తృతమైన వైద్య సేవల్ని అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని మరింత పటిష్టం చేశామన్నారు. 976 పిహెచ్సీ భవనాలకు పూర్తి స్థాయిలో రిపేర్లు చేపట్టామని, అలాగే 152 కొత్త పిహెచ్సీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నామని మంత్రి వివరించారు.

**త్వరలో 110 మంది డాక్టర్ల నియామకం**

గ్రామీణ ప్రాంతాల్లో 1144 పీహెచ్‌సిలు, పట్టణ ప్రాంతాల్లో 560 యుపిహెచ్‌సీలు ఉన్నాయని మంత్రి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవల్ని మరింత చేరువ చేసేందుకు ఇటీవల 2500 మంది డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బందిని నియమించామని, మరో 110 మంది డాక్టర్లను త్వరలో నియమించేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి సభకు తెలిపారు. వ్యక్తి ఆధారంగా (ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు) ముందస్తు ఆరోగ్య సంరక్షణా చర్యల్ని(ప్రివెంటివ్ హెల్త్ కేర్) చేపట్టాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు 'సంజీవని' కార్యక్రమాన్ని తీసుకొచ్చారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు కావాల్సిన సిబ్బంది నియామకానికి టాటా ఎండి తోనూ, అదేవిధంగా టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం గేట్స్ ఫౌండేషన్ తోనూ ప్రభుత్వం ఒప్పందాన్ని కుదుర్చుకుందన్నారు. సంజీవని కార్యక్రమం అమలులో భాగంగా సిబ్బంది అందరికీ శిక్షణ కూడా ఇచ్చామన్నారు.

**కొత్తగా 19 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేశాం**

పీహెచ్సీల్లో అవకాశం ఉన్నచోట శిక్షణ పొందిన డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్ ప్రసవాల్ని నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రసవాలు చేసేందుకు అల్ట్రా స్కానులు, టిఫా స్కాన్ల అవసరముంటుందని, 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సిహెచ్‌సిల్లో) ఇవి జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరి హెల్త్ రికార్డును డిజిటలైజ్ చేయాలనే ఉద్దేశంతో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబిడిఎం) యూనిక్ ఐడీని కూడా క్రియేట్ చేస్తున్నామన్నారు. 25 నెలల్లో 19 డయాలసిస్ సెంటర్లను మంజూరు చేశామని మరో ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు. పిహెచ్సీల్లో డయాలసిస్ సెంటర్లు లేవని, సిహెచ్సీల్లోనే ఉన్నాయని మంత్రి సభకు వివరించారు.

# విజయవాడలో ఘనంగా వెటరన్స్ డే వేడుకలు
## - ముఖ్యఅతిథిగా హాజరైన హోం మంత్రి అనిత




**విజయవాడ, ఫిబ్రవరి 17:-(లక్ష్యం న్యూస్)**

విజయవాడలో సైనిక్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'వెటరన్స్ డే' వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరై సైనిక వీరులకు గౌరవ వందనం స్వీకరించారు.

ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, సైనిక వీరులకు గౌరవ వందనం స్వీకరించడం తనకు అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. యూనిఫామ్‌లో ఉన్నా లేకపోయినా మాజీ సైనికులు సరిహద్దుల్లోనే కాకుండా సమాజంలోనూ, విపత్తుల సమయంలో అందిస్తున్న సేవలు అమోఘమని ప్రశంసించారు. దేశ నిర్మాణంలో వారి సహకారం అమూల్యమని పేర్కొన్నారు.దేశాన్ని కుటుంబం, కులం, మతం కంటే ఎక్కువగా ప్రేమించడం అంటే ఏమిటో మాజీ సైనికులు తమ సేవల ద్వారా దేశానికి చూపించారని అన్నారు. సైనికులతో సమానంగా త్యాగం చేస్తున్న



వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మాజీ సైనికుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపడుతోందని వెల్లడించారు. ప్రత్యేకంగా సైనిక్ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి మాజీ సైనికుల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.యువత కూడా మాజీ సైనికుల సేవలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, దేశభక్తి లక్షణాలను పెంపొందించుకోవాలని హోం మంత్రి పిలుపునిచ్చారు.

## మదనపల్లి ఘటనపై
# హోం మంత్రి అనిత సీరియస్..

**మదనపల్లి(లక్ష్యం న్యూస్)**

మదనపల్లిలో జరిగిన దారుణ ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన చాలా బాధాకరమని పేర్కొంటూ, బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు వెల్లడించారు.ఘటనకు సంబంధించి ముందుగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియాలో తనను ట్యాగ్ చేశారని అనిత తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. ప్రాథమిక విచారణలో ముద్దాయి డ్రగ్స్ లేదా గంజాయి సేవించలేదని, అయితే మితిమీరిన మద్యం సేవించినట్లు గుర్తించామని వెల్లడించారు. మొదట బాలిక అదృశ్యమై ఉండవచ్చని అనుకున్నామని, కానీ స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు విచారణ చేపట్టి బాలిక మృతదేహాన్ని ఆమె ఇంటి ఎదురుగా గుర్తించారని తెలిపారు.నిందితుడిని తమకు అప్పగించాలని స్థానికులు ఆందోళనకు దిగారని హోంమంత్రి చెప్పారు. అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉండటంతో, విచారణకు ఆటంకం కలగకుండా బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టంకి, నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అతడు బెయిల్‌పై బయటకు రాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఇటువంటి ఘటనలపై తమ ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.కాగా, మదనపల్లిలో చిన్నారి హత్య కేసు ఉద్రిక్తతకు దారి తీసింది. చిన్నారి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తీసుకెళ్లేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలను స్థానికులు అడ్డుకుంటూ ఆందోళనకు దిగారు. నిందితుడిని తమకు అప్పగించాలని, లేకపోతే ఎన్‌కౌంటర్ చేయాలంటూ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఎస్పీ సహా ఇతర పోలీసు అధికారులు స్థానికులతో చర్చలు జరిపారు.. ఆందోళన కారణంగా చెన్నై-ముంబై జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని కచ్చితంగా కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేస్తామంటూ కడప ఎస్పీ విశ్వనాథ్ స్థానికులకు వివరించే ప్రయత్నం చేస్తున్న స్థానికులు ఆందోళన విరమించకపోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# కేసీఆర్‌కు బర్త్ డే విషెస్..



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘకాలంగా ప్రజా జీవితంలో ఉన్న నాయకుడు కేసీఆర్ అని పవన్ కల్యాణ్ అన్నారు.ప్రజలకు ఆయన మరింత సేవ చేసే శక్తిని, సంపూర్ణ ఆయురారోగ్యాలను, సుఖసంతోషాలను అందించాలని భగవంతుడిని ప్రార్థించారు.కేసీఆర్ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని జగన్ ఆకాంక్షించారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

# జెనీవాలో ఇరాన్,అమెరికా భేటీ

**(జెనీవా నుంచి)**అమెరికా మరియు ఇరాన్ మధ్య అణు చర్చలు మంగళవారం నాడు జెనీవాలో ప్రారంభం.పశ్చిమ ఆసియాలో వాషింగ్టన్ గణనీయమైన సైనిక నిర్మాణాన్ని కొనసాగిస్తున్నప్పటికీ, ఇరాన్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి అమెరికా ప్రయత్నాలు విఫలమవుతాయని ఇరాన్ సుప్రీం నాయకుడు హెచ్చరించారు . ఒమన్ మధ్యవర్తిత్వం వహిస్తున్న ఈ చర్చలలో అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్ మరియు జారెడ్ కుష్నర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చితో పాటు పాల్గొంటున్నారు.కొన్ని నెలల క్రితం నాటకీయంగా ఘర్షణలు చెలరేగిన తర్వాత ఈ చర్చలు జరిగాయి. గత ఏడాది జూన్‌లో ఇజ్రాయెల్ ఇరాన్ అణు కేంద్రాలపై బాంబు దాడి ప్రారంభించినప్పుడు వాషింగ్టన్ మరియు టెహ్రాన్ ఆరో రౌండ్ చర్చలు జరపాల్సి ఉంది, ఆ తర్వాత అమెరికా బి-2 బాంబర్లు కూడా చేరాయి. అప్పటి నుండి టెహ్రాన్ యురేనియం సుసంపన్న కార్యకలాపాలను నిలిపివేసినట్లు తెలిపింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ ఒక ఒప్పందానికి రావడానికి సిద్ధంగా ఉండవచ్చని సూచించారు, అయితే ఇరాన్‌లో "పాలన మార్పు" జరగగల ఉత్తమమైన విషయం కావచ్చని కూడా ఆయన అన్నారు. అమెరికా ఈ ప్రాంతానికి యుద్ధ దళాన్ని మోహరించింది మరియు ఇరాన్ సోమవారం ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన జలమార్గమైన హార్ముజ్ జలసంధిలో సైనిక విన్యాసాలు నిర్వహించింది.

# జిల్లాలో ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత లక్ష్యం మేరకు వచ్చే మార్చి నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలి :జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**మచిలీపట్నం ఫిబ్రవరి 17 లక్ష్యం న్యూస్**

మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయం నుండి క్షేత్రాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 108.44 కోట్ల రూపాయల మేరకు ఉపాధి హామీ పనులు చేపట్టవలసి ఉండగా ఇప్పటివరకు 47 కోట్ల రూపాయల మేరకు పురోగతి సాధించారన్నారు. అందులో 43 శాతం మేరకు బిల్లులను చెల్లింపు కోసం అప్లోడ్ చేశారన్నారు. మిగిలిన 61 కోట్ల రూపాయల పనులను ఎట్టి పరిస్థితుల్లోనైనా మార్చి 15వ తేదీ లోగా పూర్తి చేసి అందుకు సంబంధించిన బిల్లులను అప్లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు మురిగిపోకుండా సకాలంలో సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్సోద్వారా పిడి కే శివప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణ రావు, పలువురు ఏపీవోలు డి ఈఈ లు, , ఏఈ లు పాల్గొన్నారు.



# పొట్ట చేత పట్టుకుని, కూలీ పనుల కోసం ఊరూరా తిరుగుతున్న సంచార జాతులు

## - 76 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో మార్పుకు నోచుకోని పూజ గొల్లల జీవితాలు



తెనాలి ఫిబ్రవరి 17 (లక్ష్యం న్యూస్, డెల్టా బ్యూరో ) రాజ్యాంగం అమల్లోకి వచ్చి 76 ఏళ్ళు దాటినప్పటికీ, కొన్ని అట్టడుగు కులాల జీవితాలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయి. వాటిలో పూజ గొల్ల కులాల జీవితాలు దుర్భరంగా ఉన్నాయి. గుంటూరు జిల్లా, వినుకొండ మండలం, ఉప్పరపాలెం గ్రామానికి చెందిన పూజ గొల్లలు( ఒకప్పుడు గంగిరెద్దులవారు) ఆ గ్రామంలో సుమారు 300 కుటుంబాలు పైనే ఉన్నాయని, చెబుతున్నారు. గతంలో పొట్ట చేత పట్టుకుని, సంచార జాతులుగా గంగిరెద్దులతో నడుచుకుంటూ ఊరూరా తిరిగి యాచక వృత్తిని తలపిస్తూ, దయనీయంగా జీవించేవారు. వారి కుటుంబాలు వ్యవసాయ కూలీలుగా, చిన్న చిన్న పనులు చేస్తూ జీవనం సాగించేవారు. గ్రామంలో పనులు లేకపోవడంతో గ్రామానికి చెందిన నలబోలు ఏగయ్య, సుమారు 10 కుటుంబాలను వెంటబెట్టుకుని, వలస బాట పట్టారు. కొద్దిరోజుల క్రితం తెనాలి మండలం కఠేవరం గ్రామంలో తల దాచుకునేందుకు, అక్కడికి వచ్చి ఖాళీ స్థలాలకు చెందిన వ్యక్తులతో మాట్లాడి, గుడారాలు ఏర్పాటు చేసుకుని, అత్యంత దయనీయంగా కూలి పనులు వెతుక్కుని తద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. .స్వతంత్రం వచ్చిఏళ్ళూ, పూళ్ళు గడిచిపోతున్నప్పటికీ, బతుకుతెరువు కోసం ఊరు వాడ వదిలి వలస రావటం ప్రభుత్వాలుకు కూడా వీరి అభివృద్ధి పట్టకపోవడం, నాయకుల పరిపాలనకు అద్దం పడుతుంది. వీరు మొత్తం నాలుగు తెగలుగా ఉన్నారని, చెబుతున్నారు. వారిలో పెద్దింటి గొల్లలు, నల్లగొల్లలు, ఎర్రగొల్లలు,పూజా గొల్లలు. (గంగిరెద్దుల వారు) గంగిరెద్దులతో యాచక వృత్తిలా గ్రామ గ్రామానికి తిరిగే విధానం అవమానంగా భావించి, కూలీ పనులు అలవాటు చేసుకుని, స్వతంత్రంగా జీవించడం ప్రారంభించామని ఏగయ్య చెబుతున్నాడు. ఇది తమకు ఆత్మస్థైర్యం నింపినప్పటికీ, ఊరిలో పనులు లేకపోవడంతో అక్కడ బతకలేక, పనులు కోసం ఊరూరా సంచరిస్తూ, ఇలా వచ్చామని, ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ తమ ఆత్మగౌరవానికి ఇది ప్రతీక అన్నారు. తాము పోలేరమ్మతల్లి, గంగమ్మ తల్లి , మారెమ్మ తల్లి ,అంకమ్మతల్లి గ్రామ దేవతలకు పూజలు చేసి, కొలుపులు నిర్వహిస్తామన్నారు. సంక్రాంతి, శివరాత్రి, ఉగాది, పర్వదినాలను పండగలు ఆచరిస్తామన్నారు. తాము ఇళ్లు విడిచి వచ్చిన కాలం నుండి ,సుమారు నాలుగు నుండి ఐదు నెలల వరకు ఇలా పనుల కోసం సంచారం చేసి జీవిస్తానమమని, మనసున్న మారాజులు, తమ దయనీయ స్థితిని చూసి, జాలిపడి, తలదాచుకునేందుకు చోటు ఇస్తారని, కఠేవరం గ్రామస్తులు తమను ఆదరించినందుకు వారు, ఆశ్రయమిచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే రాత్రిపూట చీకటి మాటునే, వంటా వార్పు చేసుకుని, దయనీయంగా ఉంటామన్నారు., వీరి దయనీయ సంచార జీవితాలపై మాజీ ఎమ్మెల్యే బోళ్ల బ్రహ్మనాయుడు, ప్రస్తుత ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, దృష్టి సారించకపోవడం చెప్పుకోదగ్గ విషయం. వారి వలసలు నిరోధించి, ఉన్న ప్రాంతంలోనే స్థానికంగా వారికి జీవనోపాధి కల్పించడమో, అలాగే వారికి ప్రభుత్వపరంగా తగు సహాయ, సహకారాలు అందించి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే, వీలు కల్పిస్తే, అభివృద్ధి చెందే అవకాశం, అవసరం ఎంతైనా ఉంది. పాలకులు ఆ దిశగా ఆలోచించాలని వారు కోరుతున్నారు.

# అగ్ని ప్రమాద బాధిత కోర్టు ఉద్యోగి కి లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ చేయుత...





**మచిలీపట్నం, ఫిబ్రవరి 17 లక్ష్యం న్యూస్**

మచిలీపట్నం నియోజకవర్గం పోతేపల్లి గ్రామంలో జిల్లా కోర్టు ఉద్యోగి అర్జా లక్ష్మీ ఇల్లు ఆదివారం సాయంత్రం గ్యాస్ లీకేజ్ తో ఇల్లు మొత్తం కాలిపోయింది. సుమారు 7 లక్షల రూపాయలు నష్టం వాటిల్లింది. అర్జా లక్ష్మీ తన భర్త సుబ్బారావు ముగ్గురు చిన్నపిల్లలతో కాపురం ఉంటుంది. గ్యాస్ లీకేజీతో ఇల్లు మొత్తం కాలిపోయి కట్టుబట్టలతో ప్రాణాలతో బయటపడ్డారు. మంగళవారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ న్యాయవాది లంకి శెట్టి బాలాజీ బాధిత కుటుంబానికి నిత్యవసర వస్తువులు, బియ్యం బట్టలు, వంట సామాగ్రి, 5,000 రూపాయలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ గతంలో ఇల్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ పరంగా ఇచ్చే 5,000 రూపాయలు రద్దుచేసి కేవలం 25 కేజీలు బియ్యం ఇవ్వటం సమంజసం కాదని అన్నారు. నిజమైన అగ్ని బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా పక్కా ఇల్లు నిర్మించి లక్ష రూపాయలు బ్యాంకు రుణం మంజూరు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. బాధిత కుటుంబానికి మచిలీపట్నంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవాలని బాలాజీ కోరారు. రాబోయే వేసవికాలం పురస్కరించుకొని నగర ప్రజలు విద్యుత్తు షార్ట్ సర్క్యూటివ్ గ్యాస్ లీకేజీ పట్ల అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాలను నివారించుకోవాలని బాలాజీ అన్నారు. మచిలీపట్నం చుట్టుపక్క ప్రాంతాలలో అగ్ని ప్రమాద బాధితులకు గత 15 సంవత్సరాలుగా అండగా ఉంటున్న లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సేవలు ఆదర్శప్రాయమని మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో పోతేపల్లి జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ తోట రాజేష్, మాజీ గ్రామ సర్పంచ్ శ్రీపతి చంద్రం, తమన్నఆదిత్య పోతేపల్లి సచివాలయం ఉద్యోగి ప్రభు ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు

# నిర్దేశిత లక్ష్యాలను బ్యాంకర్లు పూర్తి చేయాలి

**- అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలి**

**- పెండింగ్ దరఖాస్తులకు రుణాలు మంజూరు చేయాలి.**

**బాపట్ల బ్యూరో ఫిబ్రవరి 17 లక్ష్యం న్యూస్:**



బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు డీసీసీ కమిటీ మరియు డీఎల్ఆర్సీ బ్యాంకర్లు తో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు లకు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. డి సి సి మరియు డి యల్ ఆర్ సి సమావేశాలకు బ్యాంకు మేనేజర్లు తప్పకుండా హాజరు కావాలన్నారు.

2025 – 26 సంవత్సరం కు సంబంధించి జిల్లా ప్రణాళిక డిసెంబర్ 31 నాటికి రూ.15819.77 లక్ష్యంకాగా,ఇప్పటి వరకు రూ.16663.34 సాధించి, 105 శాతం సాధించడం జరిగిందని లీడ్ బ్యాంకు మేనేజర్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. ముఖ్యంగా వ్యవసాయం, స్వయం ఉపాధి, మహిళా సంఘాలు, చిన్న మరియు మధ్య తరహా వ్యాపారులకు రుణాల సకాలంలో మంజూరు విషయంలో బ్యాంకులు చురుకుగా వ్యవహరించాలన్నారు. ప్రధానమంత్రి జనధన్ యోజన, పీఎంఎఫ్‌బీవై, పీఎంఈజీపీ, స్టాండ్ అప్ ఇండియా వంటి పథకాలలో పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంభందిత బ్యాంకు అధికారుల ను ఆదేశించారు. రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు లక్ష్యాలకు అనుగుణంగా జారీ చేయాలన్నారు.
జిల్లాలో బ్యాంకుల సీడీ రేషియో (క్రెడిట్ డిపాజిట్– రేషియో) స్థితిగతులను సమీక్షిస్తూ, రుణాల మంజూరులో మెరుగైన పనితీరు కనబరచాలని యల్ డి యం ను బ్యాంకు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణాలు అందించాలని,బ్యాంకర్లు శాఖలతో సమన్వయం చేసుకొని అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. డిఆర్డీఏ,మెప్మా,గృహ నిర్మాణ సంస్థ,వ్యవసాయ ఉద్యాన,పశు సంవర్ధక,మత్స్య, పరిశ్రమల శాఖల అధికారుల పరిధిలో ఉన్న పెండింగ్ లో దరఖాస్తులు బ్యాంకు అధికారుల తో మాట్లాడి నిర్ణిత గడువులోగా రుణాలు మంజూరు చేయించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివ కృష్ణ, ఆర్ బి ఐ, యల్ డి ఓ.పి.యలమంద, డి సి సి కన్వీనర్ మాధురి,టి,జిల్లా వ్యవసాయ అధికారిణి విజయ నిర్మల,మత్స్య శాఖ ఏ డి,గాలి దేవుడు, పి డి లు డిఆర్డీఏ మెప్మా,సింగయ్య, ఆనంద సత్యపాల్, పశు సంవర్ధక శాఖ జెడి వేణుగోపాల్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# రిలయన్స్ స్కాలర్షిప్ కు ఎంపికైన డా. ఎల్ హెచ్ ఆర్ కళాశాల విద్యార్థిని







**మైలవరం,ఫిబ్రవరి: 17( లక్ష్యం ప్రతినిధి )**

డా. లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైలవరం బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థిని కుమారి పసుపులేటి డామిని సరయు రిలయన్స్ ఎడ్యుకేషన్ స్కాలర్షిప్ కు ఎంపికైనది. 10అక్టోబర్ 2025 జరిగిన రిలయన్స్ స్కాలర్షిప్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్లో మెరిట్ సాధించి 50 వేల స్కాలర్షిప్ కు ఎంపిక అవడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా. ఇళ్ల రవి ప్రత్యేకగా అభినందించారు. అదే విధంగా మిగిలిన రెండు సంవత్సరాలు కూడా ఈ స్కాలర్షిప్ అందుతుందని , పి.జి లో కూడా ఈ స్కాలర్షిప్ వస్తుందని మొత్తం ఐదు విడతల్లో రెండు లక్షల యాభై వేలు ఆర్థిక సహాయం రిలయన్స్ సంస్థ ఈ స్కాలర్షిప్ అందిస్తుందని తెలియజేశారు. స్కాలర్షిప్ కి ఎంపికైన విద్యార్థిని బీకాం కామర్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రమాదం వద్దు- ప్రాణం ముద్దు

**– రహదారి భద్రతపై పెడన పోలీసుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం...**

**పెడన : ఫిబ్రవరి 17 లక్ష్యం న్యూస్**




కృష్ణాజిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పెడన అదనపు ఎస్ఐ షేక్ బషీర్ ఆధ్వర్యంలో మచిలీపట్నంకత్తిపూడి 216 జాతీయ రహదారిపై పెడన తోటమూల సెంటర్ వద్ద ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గతంలో ప్రమాదానికి గురైన వాహనాన్ని రహదారి పక్కన ఏర్పాటు చేసి, ప్రమాదాల తీవ్రతను వాహనదారులు ప్రత్యక్షంగా గమనించేలా చేశారు. ప్రమాదాల వల్ల కలిగే ప్రాణనష్టం, కుటుంబాలపై పడే భారాన్ని ప్రజలకు అర్థమయ్యే విధంగా పోలీసులు వివరించారు. పోలీసులు వాహనదారులకు వేగ నియంత్రణ పాటించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించడం వంటి ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. నిర్లక్ష్యం క్షణాల్లోనే ప్రాణాపాయం కలిగిస్తుందని, జాగ్రత్తగా ప్రయాణించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

# నాయుడుపేట పట్టణ సీఐగా

## వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ.



**లక్ష్యంన్యూస్ (నాయుడుపేట) ఫిబ్రవరి 17**

నాయుడుపేట పట్టణ నూతనసర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వర్లు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ప్రకాశం జిల్లా పొదిలిలో సీఐగా పనిచేసిన ఆయన, అక్కడి నుండి వీఆర్ కు వెళ్లారు. తాజాగా ప్రభుత్వం జరిపిన బదిలీల్లో భాగంగా నాయుడుపేట అర్బన్ సీఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు.

# వారాహి అమ్మవారికి మహామంగళ అమావస్య పూజ



**కొల్లిపర ఫిబ్రవరి 17 (లక్ష్యం న్యూస్)**

మండలంలోని కుంచవరం గ్రామంలో వేంచేసిన వారాహి అమ్మవారి ఆలయంలో మాఘ అమావాస్య శుభ సందర్భంగా శ్రీవారాహి అమ్మవారికి విశేషంగా పంచ శుక్తములతో వేదమంత్రాల మంగళ వాయిద్యాల నడుమున వాసవి పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పరమ పూజ్య శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) వారి స్వయం పర్యవేక్షణలో వారాహి అమ్మవారికి 108 బిందెలతో (1008 లీ) పానకముతో మాహా అభిషేకము నిర్వహించారు. పూజ్య స్వామీజీ వారు మాట్లాడుతూ భక్తులు తమ స్వహస్తాలతో వారాహి అమ్మవారికి అభిషేకము చేసుకోవడం వారి పూర్వజన్మ సుకృతం. అభిషేకము చేయటం వలన ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, భోగభాగ్యాలు లభించును. లోక కళ్యానార్థం వ్యవసాయ, ఉద్యోగ, వ్యాపార అభివృద్ధి కొరకు ఈ కార్యక్రమంలో నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ తన్నీరు శ్రీనివాసరావు గారి దంపతులు స్వామి రమేష్ వాసవి దంపతులు, ఎస్ వి యోగ కన్వీనర్ ముద్దా బత్తుని రమణయ్య దంపతులు మరియు పరిసర ప్రాంతాల వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా చైతన్యమే... లక్ష్యం తెలుగు దినపత్రిక
బుధవారం 18-2-2026

# క్రమశిక్షణ - పట్టుదల లక్ష్యానికి మార్గాలు - కలెక్టర్

(వేటపాలెం) చీరాల/బాపట్ల బ్యూరో ఫిబ్రవరి 17 లక్ష్యం న్యూస్:

మనం లక్ష్యం సాధించాలంటే క్రమశిక్షణ తో పాటు పట్టుదల కూడా ఎంతో అవసరమని దాంతోనే మీరు ఎంచుకున్న లక్ష్యాలను సాధించటానికి సాధ్యమవుతుందని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పేర్కొన్నారు. క్రమశిక్షణతో ఉంటే నెంబర్ వన్ స్థానం పొందవచ్చు అన్నారు.జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా వేటపాలెం మండలం దేశాయిపేట ఎం జె పి ఏ పి బిసి సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు జిల్లా కలెక్టర్ మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూసంవత్సరాంత పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు స్ఫూర్తి నింపుతూ ప్రసంగించారు. భవిష్యత్తులో నెంబర్ వన్ స్థానంలో నాయకుడిగా నిలవడానికి క్రమశిక్షణతోపాటు పట్టుదల ఉండాలని కలెక్టర్ ఉద్ఘాటించారు. మీ లక్ష్యం గొప్పగా ఉండాలి, అప్పుడే మీరుద్దేశించిన గమ్యానికి చేరుకోగలరన్నారు. పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఏపీలోనే బాపట్ల జిల్లాలోని విద్యార్థులంతా టాప్ వన్ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. నిరంతరం క్రమశిక్షణతో మెలగడం ద్వారానే క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్ అంతర్జాతీయ క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించారన్నారు. నేను నెంబర్ వన్ లీడర్ గా ఎదగాలనే పట్టుదల జిజ్ఞాస మీలో ఉండాలన్నారు. క్రమశిక్షణతో నిరంతరం సాధన చేయడం ద్వారా మీరు అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరని వారిలో స్ఫూర్తి నింపారు. ఒక ఉపాధ్యాయుడు ప్రోత్సాహంతోనే నేను పదో తరగతి చదివేటప్పుడు నేషనల్ టాలెంట్ టెస్ట్ లో ఎంపిక అయ్యానని తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. దేశవ్యాప్తంగా ఎంపికైన వెయ్యి మందిలో నేను ఒకనిగా నిలవడం నా జీవితానికి స్ఫూర్తిని నింపిందన్నారు. మా జిల్లా నుంచి నేను ఒక్కడిని మాత్రమే ఎంపికయ్యానని తను క్రమశిక్షణ పట్టుదలతో సాధించిన విజయాలను విద్యార్థులకు వివరిస్తూ విద్యార్థులలో స్ఫూర్తినింపారు. విద్యార్థులు బాగా చదువుకుంటూ ఆరోగ్యంతో ఎదగడానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడానికి ప్రభుత్వం నులిపురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని వెలికితీయాలని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. నాయకత్వ లక్షణాలు అలవడేలా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. ఒక జిల్లా అధికారి బాగుంటే ఆ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది పనితీరు అంతా బాగుంటుందన్నారు. అలాగే ఒక పాఠశాల ప్రిన్సిపాల్ లేదా ప్రధానోపాధ్యాయుడు బాగుంటే ఆ పాఠశాలంతా బాగుంటుంది. ఆ పాఠశాలలోని విద్యార్థులంతా మంచిగా చదువుతారు. నాయకత్వం లక్షణాలు అలవాడేలా నిరంతరం శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటారని వివరించారు.బాల బాలికల ఆరోగ్యం కొరకు ప్రభుత్వం నులిపురుగుల మాత్రలను పంపిణీ చేస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ తెలిపారు. ఏడాది నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఈ మాత్రలను జిల్లావ్యాప్తంగా పంపిణీ చేస్తున్నామన్నారు. నులిపురుగుల మాత్రలు వేసుకున్న చిన్నారులు రెండ రోజులు బహిరంగ మలవిసర్జన చేయరాదని సూచించారు. నులి పురుగులు పొట్టలో ఉంటే విద్యార్థులు అనారోగ్యానికి, రక్తహీనతకు గురవుతారని వివరించారు. ఆరు నెలలకు ఒకసారి మాత్రలు వేసుకోవాలన్నారు. పిల్లలు నీరసంగా ఉంటే నులిపురుగుల మాత్రలు వేయాలని సూచించారు. చిన్నారులు తినే ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు అధికంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో చీరాల ఆర్ డి ఓ టి.చంద్రశేఖర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ నాగలక్ష్మి, రాజ్ కిరణ్, మలేరియా నివారణ జిల్లా అధికారి సోమ్లా నాయక్, డాక్టర్ జయకుమార్, పాఠశాల ప్రిన్సిపల్ నహీదా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.






# జీతం అందక - జీవితాల్లో అంధకారం నెలకొంది.

## - గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్.



**చిలకలూరిపేట,ఫిబ్రవరి -17 లక్ష్యం న్యూస్ )**
కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత నవంబర్ ఒకటో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 250 మందిని కుక్ లు, కమాటీ లను ప్రభుత్వం ఎస్ ఆర్ ఆర్ ఏజెన్సీ ద్వారా నియమించింది. నెలకు రూ 15000 వేలు వేతనం నిర్ణయించింది. విధులలో చేరిన నాటి నుంచి నేటి వరకు ఒక్క రూపాయి కూడా జీతం అందక వారి జీవితాల్లో అంధకారం నెలకొందని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ అన్నారు. మంగళవారం నరసరావుపేట లోని సిపిఐ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రూ.15000 వేలు ఇచ్చే జీతభత్యంలో రూ.8000 వేల నుంచి 10,000 వేల వరకు వస్తున్నాయని పనిచేస్తున్న బాధితులు ఆరోపిస్తున్నారని తెలిపారు. సర్వీస్ చార్జీల పేరుతో సగం జీతం కోతలు విధించడం ఏమిటని నాయక్ ప్రశ్నించారు. గతంలో ఏజెన్సీ ఆప్కాస్ కు అప్పగించారు. దాన్ని పక్కనపెట్టి ఎస్ ఆర్ ఆర్ కు అప్పగించడం వల్ల సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయని, ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.ఇదిలా ఉండగానే సుమారుగా 1400 మంది సిబ్బంది నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేయడం చూస్తా ఉంటే ఇందులో బలమైన కుట్ర కోణాలు దాగి ఉన్నాయని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. ఏజెన్సీల దోపిడీలను అడ్డుకట్ట వేసి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని శీను నాయక్ డిమాండ్ చేశారు.

# సీఎంఆర్ఎఫ్ తో పేదలకు ఆర్థిక భరోసా.

## - ఎల్.ఓ.సీలను అందజేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు





**ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్, ఫిబ్రవరి :17( లక్ష్యం ప్రతినిధి )**
అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు నాణ్యమైన వైద్య సేవల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు.ఇటీవల అనారోగ్యానికి గురైన పలువురికి మెరుగైన వైద్యసేవల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సి)లు తాజాగా 12 మందికి మొత్తం రూ.23,07,467లు మంజూరయ్యాయి. వీటిని విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో లబ్దిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మంగళవారం అందజేశారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మైలవరం నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.13 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థికసాయాన్ని పేదలకు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) తెలుగు రైతు బిడ్డ.అంకేం సురేష్ అంకేం ప్రియదర్శిని రెడ్డిగూడెం మండల పార్టీ అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వర్రెడ్డి స్థానిక కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా జరగనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 11 వార్షికోత్సవం.

## - వెంకటాచారి నగర్ ఆలయ కమిటీ సభ్యులు

**చిలకలూరిపేట,ఫిబ్రవరి - 17 (లక్ష్యం న్యూస్)**
పట్టణం లో పాటిమీద ఉన్న వెంకటా చారి నగర్ నందు వేంచేసియున్న కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 11వ ఆలయ వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా వెంకటాచారి నగర్ ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ముఖ్యంగా స్వామి వారి కళ్యాణం, పదహారు రోజుల నిర్వహించే పండుగ ఈ నెల 19/02/2026 గురువారం రోజు ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయని వారు తెలిపారు. కావున భక్తులందరూ అధిక సంఖ్యలో విచ్చేసి, స్వామి వారిని దర్శించుకుని, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి మరియు ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం



కృష్ణా :మచిలీపట్నం, ( 17-02-26 మంగళవారం ) కలెక్టరేట్లో లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించిన విద్యా శాఖ అధికారులతో మార్చి 16 వ తేది నుండి జరగనున్న పదో తరగతి మరియు ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై జరిగిన సమీక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ డీ.కే బాలాజీ

# ఘంటసాల మండలం,దాలిపర్రు గ్రామంలో డాక్టర్ అంబేద్కర్ గారి విగ్రహం వద్ద 3 CC కెమెరాలు,మరియు డాక్టర్ BR అంబేద్కర్ లైబ్రరీని ప్రారంభించిన ఘంటసాల SI V.చందన



కీర్తిశేషులు గడ్డేటి అక్కమ్మ, వెంకటేశ్వర్లు గారి పరిణీర్యాణం రోజు ఇవి ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో వారి కుమారులు గడ్డేటి పెద నాంచారయ్య,వారి కుటుంబసభ్యులు, నాగులు,వారికుటుంబ సభ్యులు తో పాటు కోటే రామనాథ్,గోవాడ రవి, రమాబాయి అంబేద్కర్ సంఘ నాయకులు చిర్ల కిషోర్,గ్రామ సర్పంచ్ డోకుపర్తి శాంతకుమారి, కార్యదర్శి సందీప్ రెడ్డి,చిర్ల శీను, మహిళలు,గ్రామస్థులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి అంబేద్కర్ అభిమాని దాసి సీతారామరాజు అధ్యక్షత వహించారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



**అమర్తలూరు ఫిబ్రవరి 17 (లక్ష్యం న్యూస్)**
జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం అమర్తలూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమమునకు మండల అధ్యక్షులు రాపర్ల నరేంద్ర కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ సంగెపు వెంకటలక్ష్మి మాట్లాడుతూ సంవత్సరమునకు రెండు పర్యాయములు ఒకటవ సంవత్సరము నుండి 19 సంవత్సరంల మధ్య వయస్సుల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. నులిపురుగుల వలన రక్తహీనత,అజీర్ణం వంటి వ్యాధులు వస్తాయన్నారు. మండల తహసిల్దార్ కె.నెహ్రూబాబు మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు మలవిసర్జన తరువాత చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవాలన్నారు. పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్ధములను తీసుకోవాలన్నారు. మండల అభివృద్ధి అధికారి బి.మారుతి శేషమాంబ మాట్లాడుతూ మలవిసర్జన బహిర్గత ప్రదేశంలో చేయరాదన్నారు. భోజనానంతరం ఆల్బెండజోల్ మాత్రలను అందరికీ మింగించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమమునకు వైద్యాధికారి డాక్టర్ ఆకురాతి శ్రీనివాసరావు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నిరీక్షణ రావు, ఆరోగ్య విస్తరణాధికారి కొల్లి శ్రీనివాసరెడ్డి , డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ చేబ్రోలు ధనుంజయ , పర్యవేక్షకులు పుట్టగుంట శ్రీనివాసరావు ,హెల్త్ అసిస్టెంట్ మేకా శంకరప్రసాద్, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చటగా మూడు సార్లు ప్రమాణ స్వీకారం

## - మళ్లీ పట్టం కట్టిన గడ్డపోతారం మున్సిపల్ వార్డు సభ్యు



గడ్డపోతారం ఫిబ్రవరి 17 (లక్ష్యం ప్రతినిధి), గడ్డపోతారం మున్సిపల్. ముచ్చటగా మూడుసార్లు ప్రమాణ స్వీకారం చేశారు గడ్డ పోతారం పంచాయతీగా ఉన్నప్పుడు వార్డు సభ్యురాలిగా, గడ్డ పోతారం ఉప సర్పంచిగా బాధ్య తలు నిర్వర్తించిన మద్దూరి మమత.. గడ్డపోతారం మున్సిపల్ గా మారిన తరు వాత కౌన్సిలర్ ఎన్నుకున్నారు . 2012 సంవత్సరంలో 11వ వార్డు, 2018 సంవత్సరంలో 4వ వార్డుల్లో ఎన్నికై ఉప సర్పంచి అయ్యారు. ఇప్పుడు గడ్డపోతారం మున్సిపల్ గా మారిన నేపథ్యంలో గడ్డపోతారం మూడో వార్డు లో కౌన్సిలర్ గా పోటీ చేసి మళ్లీ విజయం సాధించారు. దీనితో హైట్రిక్ మహిళగా గడ్డపోతారం వార్డులో ప్రత్యేక స్నానానికి సంపాదించుకున్నారు మద్దూరి మమతా పెంటేష్ మాకు అనునిత్యం అందుబాటులో ఉంటూ అనేక రకమైన సేవలు చేస్తున్న మమతాపెంటేష్ కు వార్డు ప్రజలు అర్షం వ్యక్తం చేస్తున్నారు

# డాక్టర్ పల్లికొండ రవికుమార్ కు సత్కారం



తెనాలి ఫిబ్రవరి 17 (లక్ష్యం న్యూస్ డెల్టా బ్యూరో ) సేవాగుణం కలిగి ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న డాక్టర్ పల్లికొండ రవికుమార్ కు మార్తా గ్రూప్ ఆఫ్ నర్సింగ్ ఇన్స్టిట్యూషన్ లో చైర్మన్ యనమల ఈశ్వర్ ,రోటరీ క్లబ్ తెనాలి ప్యారిస్ చైర్మన్ రావి కృష్ణమోహన్, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెనాలి తాసిల్దార్ కె.వి. గోపాలకృష్ణ మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు, పాల్గొనగా ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా రోటరీ క్లబ్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన బిజెపి నేతలు



**అవనిగడ్డ ఫిబ్రవరి 17 లక్ష్యం న్యూస్**
కృష్ణాజిల్లా ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి నాయకులు కృష్ణాజిల్లా బిజెపి ఉపాధ్యక్షులు భోగాది చంద్రశేఖర్ కిసాన్ మోర్చా అవనిగడ్డ నియోజకవర్గం భూపతి సుబ్రమణ్యం కలవడం జరిగింది

## జాతీయ నులిపురుగుల నివారణ " దినోత్సవం



**కారంపూడి. ఫిబ్రవరి 17 .(లక్ష్యం న్యూస్)**
జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు కారంపూడి లోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డాక్టర్ రమ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై నులిపురుగులు తీవ్ర ప్రభావం చూపుతాయని, వీటి వల్ల రక్తహీనత, పోషకాహార లోపం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో రాణించగలరని, అందుకే ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న ఈ మాత్రలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతి, బాలు నాయక్, ప్రధానోపాధ్యాయులు శేష్ రెడ్డి, మస్తాన్ వలి, లాలు నాయక్ పాఠశాల సిబ్బందితో పాటు ఆరోగ్య శాఖ అధికారులు కూడా పాల్గొన్నారు

## బాలాజీ విత్తనాల దుకాణం ను ప్రారంభోత్సవం చేసిన మాజీమంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి



**చిలకలూరిపేట,ఫిబ్రవరి -17 (లక్ష్యం న్యూస్ )**
మహాశివరాత్రి పురస్కరించుకొని కోటప్పకొండ గ్రామంలో కొండపై వెలిసిన త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ళ ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా కోటప్పకొండ స్వామి ఉత్సవాలలో దాదాపు 30 లక్షల మంది భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్లకు విచ్చేసిన రైతుల కోసం బి.ఎస్.సి.ఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ విత్తనాల దుకాణం ను మేనేజింగ్ డైరెక్టర్ పెంట్యాల బాలాజీ నేతృత్వంలో ఏర్పాటు చేశారు.విత్తనాల దుకాణం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు హాజరు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు,డైరెక్టర్ పెంట్యాల బాలాజీ లు రిబ్బన్ కట్ చేసి దుకాణం ను ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా ప్రతిపాటి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి వ్యవసాయ రంగ అభివృద్ధికి సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న బి.ఎస్.సి.ఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ పెంటేల బాలాజీ కి శుభాకాంక్షలు తెలిపారు. తదనంతరం పెంటేల బాలాజీ మాట్లాడుతూ రైతుల సేవే మా ధ్యేయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు,సంస్థ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ రాజబాబు ని కలిసిన ఫిలిమ్ డైరెక్టర్లు.



తెనాలి ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్ డెల్టా బ్యూరో)ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజబాబు ను మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో తెనాలి పెదరా ఊరికి చెందినఆంధ్రప్రదేశ్ ఫిలిం డైరెక్టర్లు దోనేపూడి దిలీప్, అచ్చన శ్రీనివాస్ యాదవ్, సీనియర్ పాత్రికేయులు మంచాల విజయ్ కిషోర్ లు మర్యాద పూర్వకంగా కలుసుకొని సత్కరించారు. కలెక్టర్ రాజబాబుకు పూల బొకే అందజేసి శాలువాలతో సత్కరించారు. ప్రకాశం జిల్లా ప్రాంతంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ పి రాజబాబు వారికి హామీ ఇచ్చారు..

# సంక్షేమ పథకానికి జీవనాడి రైతన్న ఐడి





**పెదకాకాని, ఫిబ్రవరి 17. లక్ష్యం న్యూస్ :**
మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి కే.రమణ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది, పొలంబడి కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంనికి గుంటూరు డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎన్. మోహన్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల జీవనాడి రైతన్న ఐడి అని అన్నారు. ప్రతి పౌరునికి ఆధార్ కార్డు ఎంత ముఖ్యమో ప్రతి రైతుకు వ్యవసాయ శాఖ ద్వారా ఇచ్చే విశిష్ట నెంబర్ వ్యవసాయ సంబంధిత సేవ పొందేందుకు అంతే ముఖ్యమన్నారు .ఇంకా ఈ విశిష్ట నెంబర్ పొందని రైతులు సంబంధిత రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ సహాయకులను కలిసి నమోదు చేయించుకోవాలన్నారు. రాబోవు రోజుల్లో ఈ ఐడి నెంబర్ లేని రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా వచ్చు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదు చెల్లించబడకపోవచ్చుఅని తెలిపారు. కావున మండలంలోని రైతులందరూ తమ ఆధార్ కార్డు, పొలం పాస్ పుస్తకం తీసుకొని సంబంధిత రైతు సేవ కేంద్రాలను కలవాలని అన్నారు. తదుపరి ఉప్పలపాడు గ్రామంలో ఇంకా ఈ విశిష్ట సంఖ్య నమోదు చేసుకొని 155 మంది రైతుల పేర్లను చదివి వినిపించినారు తదుపరి గ్రామ రైతులతో కలిసి ఆ గ్రామంలో పండిస్తున్న మినుము పైరును పరిశీలించి మినుము వేసిన రైతులందరూ తప్పకుండా ఈనెల 20వ తారీకు లోపు పంట నమోదు చేయించుకోమని చెప్పి, ఒకవేళ పంట నమోదు చేయించుకోకపోతే వారి యొక్క మినుమును ప్రభుత్వానికి అమ్ముటకు అనర్హులుగా ఉంటారు. కావున అందరూ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు గ్రామ ఉపసర్పంచ్ బూసి బాబు,పిఎసిఎస్ ప్రెసిడెంట్ మైలా సుబ్బారావు, రామకృష్ణ, సూరిబాబు మరియు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పెన్స్ ప్యాడ్స్ పంపిణీ

**బాపట్ల ఫిబ్రవరి 17 లక్ష్యం న్యూస్:**
దీవెన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాండురంగాపురం జడ్పీహెచ్ హై స్కూల్, మరుప్రోలు వారి పాలెం జడ్.పి.హెచ్.ఎస్, టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు బహుకరించారు. వివరాల్లోకి వెళితేబాపట్ల మండల పరిధిలోని పాండురంగపురం జడ్పీహెచ్ హైస్కూల్, మరుపురోలు వారి పాలెం హై స్కూల్ నందు 10 వ తరగతి పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్లు, పెన్నులను ఫౌండేషన్ చైర్మన్ శీలం అమర్నాథ్ బహుకరించారు. ప్రతి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమంలో చేపడుతూ, విద్యార్థులకు అండగా నిలవడం జరుగుతుందన్నారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో గుర్తించి పదవ తరగతి పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులకు నోట్ బుక్స్, పరీక్ష ప్యాడ్లు, పెన్నులను బహుకరిస్తున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు.



అదేవిధంగా ప్రతి ఏడాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపులను నిర్వహించి పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఫౌండేషన్ ఏర్పాటు నుండి



సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల బ్రదర్ సామ్యూల్, బ్రదర్ థామస్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు తీర్చే వరకు సమ్మె కొనసాగింపు

## - జి.ఓ. 36 అమలు చేయాలని డిమాండ్

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**
పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక (జేఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె మాచర్లలో మంగళవారం కొనసాగింది. సమ్మెలో భాగంగా ఉద్యోగులు విధులను బహిష్కరించి పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు జింకల చెన్నయ్య, పి. రాజసాగర్ రెడ్డి, ఎస్. బ్రహ్మేశ్వరరావు, బి. రామకృష్ణ, ఇ. వెంకటేశ్వర్లు, బి. కొండలరావు మాట్లాడుతూ జి.ఓ. నెం.36ను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2019 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను చెల్లించడంతో పాటు మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు చెల్లించే గ్రాట్యుటీపై రూ.2 లక్షల పరిమితి విధించడం అన్యాయమని, గ్రాట్యుటీ చట్టం ప్రకారం పూర్తి మొత్తాన్ని చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచి సహకార సంఘాల ఉద్యోగులకు వర్తింపజేయాలని కోరారు. 2019 తరువాత నియమితులైన ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేసి, జేఏసీ ఉంచిన అన్ని డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని జింకల చెన్నయ్య స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం సిబ్బంది పాల్గొన్నారు.



నిరసనలో జేఏసీ నాయకులు

# మాచర్ల మండలంలో రూ.11.70 కోట్ల ఉపాధి పనులు పూర్తి

**- సామాజిక తనిఖీ ప్రజావేదికలో డ్వామా పీడి సిద్ధలింగమూర్తి వెల్లడి**
**- రూ.14 వేలు పెనాల్టీ, రూ.72,064 రికవరీ కోసం ప్రతిపాదన**

**మాచర్ల లక్ష్యం ప్రతినిధి :**
మాచర్ల మండలంలో రూ.11 కోట్లు 70 లక్షలు 13 వేల 296 రూపాయల విలువైన ఉపాధి హామీ పనులు నిర్వహించినట్లు డ్వామా పీడి సిద్ధలింగమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పీడి మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామపంచాయితీల పరిధిలో మొత్తం 719 పనులు చేపట్టినట్లు వెల్లడించారు. అందులో వేతనాల రూపంలో రూ.8 కోట్లు 94 లక్షలు 28 వేల 777 ఖర్చు కాగా, పంచాయతీరాజ్ శాఖ మెటీరియల్ కాంపోనెంట్‌గా రూ.2 కోట్లు 75 లక్షలు 84 వేల 519 చెల్లించినట్లు వివరించారు. 2024-2025 సంవత్సరానికి సంబంధించిన పనుల్లో రూ.1 కోటి 35 లక్షల పనులకు సామాజిక తనిఖీలు ప్రారంభమైన నాటికి సరైన వివరాలు అందలేదని తెలిపారు. అయితే 20 రోజులపాటు నిర్వహించిన గ్రామసభల్లో తగిన ఆధారాలు లభించినట్లు చెప్పారు. గతంలో విధులు మానేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు సరైన రికార్డులు అందించకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని పేర్కొన్నారు. అదేవిధంగా మరో రూ.1 కోటి 29 లక్షల 520 విలువైన పనులకు సంబంధించిన ఫోటోలు, ఆధారాలు సక్రమంగా లేవని చెప్పారు. అయితే పనులు జరిగాయని, వేతనాలు చెల్లించామని స్పష్టం చేశారు. రెక్టిఫికేషన్ కోసం అధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. తగిన పత్రాలు, ఫోటోలు సమర్పిస్తే ఆ మొత్తాన్ని కూడా ఆమోదించనున్నట్లు వెల్లడించారు. మొత్తం పనుల్లో రూ.14 వేల పెనాల్టీ విధించినట్లు తెలిపారు. అదేవిధంగా రూ.72,064 రికవరీ కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణికుమార్, ఏపిడి జి.వి. సత్యనారాయణ, ఏపీవో నాగశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న పీడి సిద్ధలింగమూర్తి

# బద్వేల్ టిడిపి ఇన్చార్జి ఇక లాంచనమే.

**డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డికి టిడిపి ఇన్చార్జి ఖాయం? - ఇంచార్జ్ పదవి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దాదాపు నిర్ణయం - బద్వేలు మాజీ మంత్రి దివంగత వీరారెడ్డి కుటుంబం నుంచి పగ్గాలు పోయినట్లే ?**

బద్వేలు (లక్ష్యం న్యూస్)
బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా డీసీసీబీ చైర్మన్ మంజూరు సూర్యనారాయణ రెడ్డి ఇక లాంచనమే అని చెప్పాలి సూర్యనారాయణ రెడ్డికి బద్వేల్ టిడిపి పగ్గాలు ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. గడచిన ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో బద్వేల్ అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఓడిపోవడం జరిగింది ఇప్పటి బద్వేలు టిడిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పార్టీ సమన్వయకర్త విజయమ్మ కుమారుడు రితేష్ రెడ్డి నియోజకవర్గంలో పార్టీని నడిపించడంలో చాలావరకు విఫలమయ్యారని అధిష్టానం గుర్తించింది తాజాగా గత శనివారం జరిగిన ముఖ్యమంత్రి సమావేశానికి కడప జిల్లా నుండి అందరూ ఎమ్మెల్యేలు పార్టీ ఇన్చార్జిలు హాజరయ్యారు కానీ బద్వేల్ నుంచి విజయమ్మ రితీష్ రెడ్డిలు హాజరు కాలేదు కారణం వారికి పిలుపు లేకపోవడమే సమావేశం జరుగుతున్న విషయం కూడా వారికి తెలియలేదు విజయమ్మ ఆమె తండ్రి దివంగత మాజీ మంత్రి వీరారెడ్డి మృతి చెందిన తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించలేకపోయింది ఒకప్పుడు బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది వీరారెడ్డి మృతి చెందిన తర్వాత ఆ వైభవం లేకుండా పోయింది 2009 నుంచి బద్వేలు అసెంబ్లీ రిజర్వ్ అయింది రిజర్వ్ అయిన తర్వాత తాజాగా 2024 ఎన్నికల వరకు తెలుగుదేశం పార్టీ ఓడిపోతూనే వస్తుంది 2024ఎన్నికల్లో మాజీ ఇరిగేషన్ అధికారి రోశన్న బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు తెలుగుదేశం పార్టీ జనసేన బిజెపి ఆయనకు పూర్తి మద్దతు ఇచ్చిన ఫలితం లేకుండా పోయింది 2024 ఎన్నికల్లో కూటమి హవ రాష్ట్రమంతా వీచిన బద్వేల్ లో మాత్రం వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు కడప జిల్లాలో వైసిపి పాగా వేయకుండా చూడాలని ముఖ్యమంత్రి గట్టిగా నిర్ణయించారు అందులో భాగంగా బద్వేల్ లో టిడిపి ఇంచార్జ్ మార్పు కోసం ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలిసింది బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం వేములూరు గ్రామానికి చెందిన ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ ప్రస్తుత డీసీసీబీ చైర్మన్మంచూరు సూర్య నారాయణ రెడ్డి ని బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా నియమించేందుకు అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం శనివారం జరిగిన కడప జిల్లా పార్టీ ఎమ్మెల్యేల వద్ద బద్వేలు నియోజకవర్గ విషయంపై ప్రత్యేకంగా మాట్లాడినట్లు సమాచారం క ఇది ఇలా ఉండగా సూర్యనారాయణ రెడ్డికి డీసీసీబీ చైర్మన్ పదవి రావడంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె కుమారుడు రితీష్ రెడ్డి ప్రమేయం ఏమాత్రం లేదని పార్టీలోని వారు చెపుతుంటారు ప్రస్తుతం పార్టీ సమన్వయకర్త రితీష్ రెడ్డి పార్టీ నడిపించడంలో విఫలమయ్యారని ఆరోపణలు ఉన్నాయి అంతేకాక వైసీపీలోని చాలామందితో ఆయనకు మంచి సంబంధం ఉన్నట్లు అధిష్టానానికి లెక్కలేనన్ని ఫిర్యాదులు అందాయి ఇది కూడా మైనస్ గా మారింది నియోజకవర్గంలోని గ్రూపులు కట్టడి చేయడంలో రితీష్ రెడ్డి విఫలమైనట్లు పార్టీ అధిష్టానం గుర్తించింది అందుకే శనివారం జరిగిన సమావేశానికి విజయమ్మ రెడ్డిలకు రాలేదు.

# 2026-27 బడ్జెట్ ఆచరణాత్మక, అభ్యుదయ బడ్జెట్...

## ప్రజల కలలకు ప్రతిరూపం : ప్రత్తిపాటి

- కష్టాలు ఎన్ని ఉన్నా ప్రజాసంక్షేమం..రాష్ట్రాభివృద్ధి కర్తవ్యాన్ని మరువని బడ్జెట్.
- తాజా బడ్జెట్ అంకెల రూపమే కాదు.. రాష్ట్ర పునర్నిర్మాణానికి సిద్ధం చేసిన ఆర్థిక శిలాఫలకం.
- తల్లికి వందనం అమలు, ఆచరణతో లోకేశ్ చరిత్ర సృష్టించారు
- స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని సాకారం చేసే బలమైన ముందడుగు ఈ బడ్జెట్
- చంద్రబాబు ఆలోచనలు, దూరదృష్టితో అన్నివర్గాలకు సామాజిక, ఆర్థిక వృద్ధి.
- కళ్లుండి చూడలేని కబోదుల్లా వైకాపా నాయకులు రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడుతున్నారు
- రాష్ట్ర వార్షిక బడ్జెట్ పై చర్చ సందర్భంగా శాసనసభలో మాజీమంత్రి ప్రత్తిపాటి ప్రసంగం



**చిలకలూరిపేట, ఫిబ్రవరి - 17 (లక్ష్యం న్యూస్)**
2026-27 రాష్ట్ర వార్షిక బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి దిక్సూచి అని, ప్రభుత్వానికి ఎన్నికష్టాలున్నా.. ప్రజా సంక్షేమం.. రాష్ట్రాభివృద్ధి అనే కర్తవ్యాలను మరువని బడ్జెట్ అని, తాజా బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజల కలలకు ప్రతిరూపంగా నిలవనుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పై చర్చ సందర్భంగా శాసనసభలో ప్రత్తిపాటి మంగళవారం మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే క్లుప్తంగా...!"రాష్ట్ర ముఖ చిత్రాన్ని మార్చే కీలక ఘట్టం తాజా బడ్జెట్ తో ఆవిష్కృతం కానుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యసాధనకు ప్రతీకగా ఈ బడ్జెట్ నిలవనుంది. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రానికి నమ్మకాన్ని అందించేలా కూటమిప్రభుత్వం తాజా బడ్జెట్ ను తీర్చిదిద్దింది. ఇది దీర్ఘకాలిక వృద్ధికి గ్రోత్ ఇంజిన్ గా నిలవనుంది.ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పాలకుల కర్తవ్యాన్ని ప్రజల ముందుంచిన ముఖ్యమైన ప్రకటన అనే చెప్పాలి. రాష్ట్రచరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈ ఆర్థిక సంవత్సరానికి అక్షరాలా 3,32,205 కోట్ల బడ్జెట్ ను ప్రజల ముందు ఉంచారు. ఇది కేవలం సంఖ్య మాత్రమేకాదు.. రాష్ట్ర పునర్నిర్మాణానికి సిద్ధం చేసిన ఆర్థిక శిలాఫలకమనే చెప్పాలి. రూ.53,915 కోట్లకు మూలధన వ్యయం పెంచడమనేది రాష్ట్ర భవిష్యత్ పై నమ్మకాన్ని పెంచనుంది. రెవెన్యూ లోటు తగ్గింపు ఆర్థిక క్రమశిక్షణకు, దీర్ఘకాలిక స్థిరత్వానికి రక్షణగా నిలవనుంది.వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.53,752 కోట్ల కేటాయింపులతో.. ఈ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వంగా నిలిచిందివ్యవసాయంలో ఏఐ వినియోగం, ఇతర సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై ప్రపంచ పారిశ్రామిక దిగ్గజం బిల్ గేట్స్ ప్రశంసలు దక్కడం నిజంగా అభినందనీయం. రైతు శ్వాసే రాష్ట్రానికి శక్తి. రైతు చెమటతోనే నేల పండుతుంది. రైతు చిరునవ్వుతోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.53,752 కోట్లు కేటాయించడం ద్వారా ఈ ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలిచింది. నీరున్న చోటనే పంట .. పంట ఉన్నచోటే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. పోలవరం నిర్మాణానికి రూ.6,150 కోట్ల కేటాయించిన ప్రభుత్వం.. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తిచేయాలన్న సంకల్పంతో ముందుకు వెళుతోంది. అన్నదాతా సుఖీభవ కింద ప్రతి రైతుకు ఈ ప్రభుత్వం ఏడాదికి రూ20వేల ఆర్థిక సాయం అందిస్తోంది. బడ్జెట్లో ఈ పథకానికి రూ.6,300 కోట్లు, ధరల స్థిరీకరణకు రూ.500 కోట్లు కేటాయించడం గమనార్హం. వ్యవసాయంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం ప్రాముఖ్యత ఇచ్చింది.

**తల్లికి వందనం అమలు. ఆచరణతో లోకేశ్ రికార్డు సృష్టించారు.**

సామాజిక న్యాయం బడ్జెట్ కేటాయింపుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళల సంక్షేమానికిబడ్జెట్లో రూ.91,527 కోట్లు కేటాయించడమే అందుకు నిదర్శనం. అందులో బీసీ సంక్షేమానికే రూ.51వేలకోట్లు కేటాయించడం నిజంగా చరిత్రే.
విద్యకు పేదరికం అడ్డుగా మారకూడదన్న సత్సంకల్పంతో దేశంలో మరే రాష్ట్రంలో అమలు కాని విధంగా ఈ ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా చదువుకునే ప్రతి విద్యార్థికి ఏటా రూ.15వేలు ఇస్తున్నాం. అందులో రూ.2 వేలు పాఠశాలల్లో మౌలిక వసతుల నిర్వహణకు వినియోగించడం జరుగుతోంది. ఈ పథకం అమల్లో విద్యాశాఖ మంత్రి లోకేశ్ కృషి వర్ణనాతీతం. తల్లికి వందనం పథకం అమలుకు రూ.9,407 కోట్లు కేటాయింపులతో రాష్ట్రం దేశంలోనే ఒక రికార్డు సృష్టించిందని గర్వంగా చెబుతున్నా. సామాజిక పింఛన్ల చెల్లింపులకోసం రూ.27,714 కోట్లు కేటాయించడం మరో గొప్ప ఘనత.

**20 నెలల్లో 11.75శాతం జీఎస్డీపీ సామాన్యం కాదు..**

రాజధాని అమరావతి ఆర్థిక చైతన్యానికి కేంద్ర బిందువుగా నిలవనుంది. ప్రజా రాజధాని నిర్మాణానికి రూ.6వేల కోట్లు కేటాయించారు. 20 నెలల కాలంలో 20 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ అనేది చంద్రబాబు, లోకేశ్ లకే సాధ్యమైన ఎఛీవ్ మెంట్. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం దూసుకుపోతోంది.
20 నెలల్లో 11.75 జీఎస్డీపీ వృద్ధిరేటు సాధించడం సామాన్య విషయం కాదు. ఇది ఆర్థిక పునరుజ్జీవానికి బలమైన సంకేతం. ఈ బడ్జెట్ ముమ్మాటికీ ప్రజా ప్రయోజనాలకోసమే రూపొందించబడింది.

**ఇతర రాష్ట్రాల్లో రాష్ట్రప్రభుత్వంపై జరిగే చర్చను తెలుసుకుంటే వైకాపాకు జ్ఞానం వస్తుంది**

2019-24 మధ్య రాష్ట్రంపై పొరుగురాష్ట్రాల్లో ఎలాంటి చర్చ జరిగింది.. ఇప్పుడు కూటమిప్రభుత్వం వచ్చాక రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, ముఖ్యమంత్రి చంద్రబాబు సుపరిపాలనపై ఏం చర్చ నడుస్తోందో ప్రతి ఒక్కరూ నిశితంగా గమనిస్తున్నారు. వైకాపా నాయకులు బయటకు వెళ్లి ఫీడ్ బ్యాక్ తీసుకుంటే.. అసత్యాలు, అబద్ధాలతో సంక్షేమానికి, అభివృద్ధికి అడ్డుపడరు. ఇండియాలో ఏ రాష్ట్రానికి వెళ్లి పరిశీలించినా.. ఏపీలో చంద్రబాబు అమలు చేస్తున్న పథకాలు.. ఆయన దార్శనికత ఫలితాలు వైకాపా నేతలకు అర్థమవుతాయి. కళ్లుండి చూడలేని కబోదుల్లా మారి, రాష్ట్రంలో అరాచకాలు సృష్టించి, అభివృద్ధికి అడ్డుపడాలనే వారి దుర్మార్గపు ఆలోచనలు మారాలి. వైకాపా నాయకులు దేశమంతా తిరిగితే వారికి కచ్చితంగా జ్ఞానం వస్తుందనే భావిస్తున్నాం.

**చంద్రబాబు ఆలోచనలు, దూరదృష్టితో అన్నివర్గాలకు సామాజిక, ఆర్థిక వృద్ధి**

రైతులకు చిరునవ్వు, మహిళలకు ఆర్థిక భరోసా, యువత భవిత లక్ష్యాల సాధనకు ఈ బడ్జెట్ ప్రధాన మార్గంగా నిలవనుంది అనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని సాకారం చేసే బలమైన ముందడుగు ఈ బడ్జెట్. చంద్రబాబు ఆలోచనలు, దూరదృష్టితో బడ్జెట్లో అన్నివర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక వృద్ధికి బడ్జెట్ దోహదం చేయనుంది." అని ప్రత్తిపాటి స్పష్టం

# క్రీడలు మన జీవితంలో చాలా ముఖ్యమైనవి..... అడిషనల్ ఎస్పీ, సత్యనారాయణ....

**మచిలీపట్నం ఫిబ్రవరి 17 లక్ష్యం న్యూస్**
జిల్లా స్పోర్ట్స్ అథారిటీ జిల్లా అధికారి, కె. ఝాన్సీ లక్ష్మి ఆధ్వర్యంలో 45వ డివిజన్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు మంగళవారంనిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ......క్రీడలు మన జీవితంలో చాలా ముఖ్యమైనవి అని, మన ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా క్రమశిక్షణ మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి అన్నారు. చెస్ ఒక మేదస్సు ఆధారిత ఆట అన్నారు. ఇది మన ఆలోచన శక్తిని, సహనాన్ని మరియు నిర్ణయ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తుంది అన్నారు.చెస్ ద్వారా మనం ముందు చూపుతో ఆలోచించడం నేర్చుకుంటాం అన్నారు. చెస్ పోటీలలో ప్రముఖ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథ్ ఆనంద్ ప్రపంచ ఖ్యాతి పొందారు అన్నారు. అలాంటివారిని స్ఫూర్తిగా తీసుకుని ఆటలో ముందుకు వెళ్లి పోటీలో విజయం సాధించాలి అన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో అవసరం, అందరూ రోజు కొంత సమయం క్రీడలకు కేటాయించాలి అన్నారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు, గొర్రెపాటి గోపీచంద్ హాజరై మాట్లాడుతూ.....మంత్రి కొల్లు రవీంద్ర క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని, యువత కోసం యువతరంగాలు, బీచ్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాలు పెట్టి మంత్రి కొల్లు రవీంద్ర క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహించారని, అలాగే మచిలీపట్నంలో క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కలుగచేయడానికి మంత్రి కొల్లు రవీంద్ర విశేష కృషి చేస్తున్నారు అన్నారు.
జిల్లా క్రీడా అధికారి కె. ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ......
రాష్ట్రస్థాయి చెస్ పోటీల ఎంపికలో భాగంగా జిల్లా స్థాయిలో చెస్ పోటీలలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన155 మంది యువత చెస్ పోటీలలో పాల్గొన్నారు అని తెలిపారు.జిల్లా స్థాయిలో జరిగిన చెస్ పోటీలలో 16 మంది యువత రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు విజేతలుగా ఎంపికయ్యారని, ఈ రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో ఎంపికైన వారు ఈనెల 21, 22 తేదీలలో తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు వారిని పంపించడం జరుగుతుంది అన్నారు.
ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది అని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువతను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి, కె. ఝాన్సీ లక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్, హసీం బేగ్, రాష్ట్ర శిష్ట కరణం సాధికార సమితి కన్వీనర్, అక్కుమం తి రాజా, తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం నగర కార్పొరేషన్ అధ్యక్షుడు, లోగి శెట్టి వెంకటస్వామి, జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ మాజీ డైరెక్టర్, అజీమ్, ప్రముఖ న్యాయవాది, అమర్, చెస్ ఆర్గనైజేషన్ ఆర్బిట్రేటర్స్ తదితరులు పాల్గొన్నారు



# లిట్మస్ టెస్ట్... ఫెయిల్... ఎమ్మెల్యేలు పట్టు కోల్పోతున్నారా...

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)**
ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టు.. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కొంతమంది ఎమ్మెల్యేలకు కష్ట కాలాన్ని తీసుకొచ్చింది. ఎందుకంటే మున్సిపల్ ఎన్నికలలో ఆ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో ప్రతికూల ఫలితాలు వచ్చాయి.కాంగ్రెస్ పార్టీలో ఎవరంటేఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక్కడ 24 వార్డులలో కాంగ్రెస్ పార్టీ కేవలం ఎనిమిది మాత్రమే గెలిచింది. గులాబీ పార్టీ 13 స్థానాలలో విజయం సాధించింది.మైనపల్లి రోహిత్ ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ నియోజకవర్గంలో మొత్తం 32 స్థానాలు ఉన్నాయి. ఇక్కడ గులాబీ పార్టీ 15 స్థానాలు సాధించింది. కాంగ్రెస్ పార్టీ 14 స్థానాలు దక్కించుకుంది.
తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ 15 వార్డులకు ఐదు మాత్రమే గెలిచింది. గులాబీ పార్టీ పది స్థానాలు దక్కించుకుంది. ఈ నియోజకవర్గంలో మందుల సామేల్ ఎమ్మెల్యేగా ఉన్నారు.ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం లో బొజ్జు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ మున్సిపాలిటీలోని 12 వార్డులలో కాంగ్రెస్ పార్టీ కేవలం నాలుగు మాత్రమే గెలిచింది. దారుణంగా మూడో స్థానంలో నిలిచింది..వర్ధన్నపేట నియోజకవర్గంలో కేఆర్ నాగరాజు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ 12 వార్డులకు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి కంటే ఒక స్థానాన్ని తక్కువ గెలిచింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ కేవలం ఐదు స్థానాలకు మాత్రమే పరిమితమైంది.మంత్రి వివేక్ నియోజకవర్గమైన చెన్నూరులో క్యాతనపల్లి మున్సిపాలిటీలో గులాబీ పార్టీ అత్యధికంగా స్థానాలను సొంతం చేసుకుంది.కల్వకుర్తి నియోజకవర్గంలో కాశిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యే గా ఉన్నారు. ఈ నియోజకవర్గం పరిధిలోని అమనగల్లులో 15 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక వార్డు మాత్రమే గెలిచింది. కల్వకుర్తిలో మాత్రం కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ స్థానాలు రావడం విశేషం..నారాయణపేట నియోజకవర్గం లో పర్ణిక రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ 24 వార్డులలో బిజెపి 11 గెలిచింది. కాంగ్రెస్ పార్టీ ఏడు మాత్రమే దక్కించుకుంది..భారత రాష్ట్ర సమితిలోజగదీష్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సూర్యపేట నియోజకవర్గంలో 48 స్థానాల లో గులాబీ పార్టీ కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ 31 స్థానాలలో విజయం సాధించింది.హుజురాబాద్ నియోజకవర్గం లో కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ 30 వార్డులు ఉంటే గులాబీ పార్టీకి కేవలం 8 స్థానాలు మాత్రమే లభించాయి.. ఇదే నియోజకవర్గంలో జమ్మికుంట మున్సిపాలిటీలో కాంగ్రెస్ కంటే గులాబీ పార్టీ రెండు ఎక్కువ వార్డులు సాధించి.. మొదటి స్థానంలో ఉంది.డాక్టర్ సంజయ్ ఎమ్మెల్యే గా ఉన్న కోరుట్ల నియోజకవర్గం లో 33 వార్డులకు గానూ గులాబీ పార్టీ కేవలం 8 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. మెట్ పల్లి నియోజకవర్గంలో కూడా గులాబీ పార్టీ రెండో స్థానంతో సరిపెట్టుకుంది.జహీరాబాద్ నియోజకవర్గంలో మాణిక్ రావు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ గులాబీ పార్టీ కాంగ్రెస్ కంటే ఒక స్థానాన్ని తక్కువ దక్కించుకుంది. ఇక ఇదే నియోజకవర్గంలోని కోహిర్ ప్రాంతంలో 16 వార్డులు ఉంటే.. భారత రాష్ట్ర సమితి ఐదు స్థానాల వరకే ఆగిపోయింది.సంగారెడ్డిలో చింత ప్రభాకర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ 38 వార్డులు ఉంటే.. కాంగ్రెస్ పార్టీ ఏకంగా 22 వార్డులలో విజయం సాధించింది. గులాబీ పార్టీ కేవలం పది స్థానాలతోనే సరిపుచ్చుకుంది. సదాశివపేట ప్రాంతంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఏకంగా 16 స్థానాలను గెలుచుకోవడం విశేషం.మల్లారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న మేడ్చల్ నియోజకవర్గంలో ఆలియాబాద్ మున్సిపాలిటీలో గులాబీ పార్టీ కేవలం ఏడు స్థానాల మాత్రమే సాధించింది. ఈ మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి. ఇక ఈ నియోజకవర్గంలోని ఎల్లంపేట, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలలో మాత్రం గులాబీ పార్టీ అత్యధిక సీటు సాధించి.. గెలుపును సొంతం చేసుకోవడం విశేషం.భారతీయ జనతా పార్టీలోబిజెపి ఎమ్మెల్యే శంకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిలాబాద్ పురపాలకంలో బిజెపి ఎక్కువ వార్డులు సొంతం చేసుకుంది. ఇక్కడ 49 స్థానాలలో 21 స్థానాలను గెలుచుకుంది బిజెపి.వేరేటి మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న నిర్మల్ లో కమలం పార్టీ 42 వార్డులకు గాను కేవలం 13 స్థానాల్లో మాత్రమే గెలుపు సాధించింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ 24 స్థానాలను సొంతం చేసుకుంది.రాకేష్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న ఆర్మూర్లో బిజెపి కేవలం ఎనిమిది వార్డులు మాత్రమే సొంతం చేసుకుంది. ఇక్కడ 36 వార్డులు ఉన్నాయి.కాగజ్ నగర్ ఎమ్మెల్యేగా పాల్వాయి హరీష్ బాబు కొనసాగుతున్నారు. ఇక్కడ 30 వార్డులు ఉంటే.. బిజెపి కేవలం ఐదు స్థానాలు మాత్రమే గెలిచింది. దారుణంగా మూడవ స్థానానికి పరిమితం అయిపోయింది.ముథోల్ నియోజవర్గంలో రామారావు ఎమ్మెల్యే గా ఉన్నారు. ఇక్కడి భైంసా మున్సిపాలిటీలో బిజెపి కేవలం ఆరు స్థానాలు మాత్రమే గెలిచింది.కామారెడ్డి ఎమ్మెల్యేగా వెంకటరమణారెడ్డి కొనసాగుతున్నారు. ఇక్కడ 49 స్థానాలు ఉంటే.. కేవలం 16 స్థానాలు మాత్రమే గెలిచింది బిజెపి. కాంగ్రెస్ పార్టీ 19 స్థానాలను దక్కించుకుంది.

# వర్సిటీ సర్వతోముఖాభివృద్ధికి కృషి

- కెయూ ఉపకులపతి ఆచార్య కె రాంజీ
- 20 కోట్లతో అభివృద్ధి పనులు
- 39 కోట్ల పనులకు ప్రతిపాదనలు
- విజయవాడలో పీజీ సెంటర్ ఏర్పాటు
- నూరుశాతం ఉద్యోగాలు



**కృష్ణా విశ్వవిద్యాలయం: మచిలీపట్నం ఫిబ్రవరి 17 లక్ష్యం న్యూస్**
కృష్ణా విశ్వవిద్యాలయం సర్వతోముఖాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య కె. రాంజీ స్పష్టం చేశారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పదవి బాధ్యతలు స్వీకరించి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భముగా మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం లో ఆయన మాట్లాడారు. గడిచిన ఏడాది కాలంలో జపాన్ , స్వీడన్ దేశాల్లోని విదేశీ విశ్వవిద్యాలయాల తో పాటు దేశం లో భారత్ ఎలెక్ట్రానిక్స్, రాజ్య సైనిక్ బోర్డు లాంటి పలు ప్రతిష్టాత్మక సంస్థల తో అవగాహన ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు.
పిఎం ఉషా పథకం కింద మంజూరైన 20 కోట్లు రూపాయలతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఆలాగే విశ్వవిద్యాలయం లో క్రీడా ప్రాంగణం అభివృద్ధికి ఖేల్ ఇండియా పథకం కింద 39 కోట్ల రూపాయల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం కు పంపించడం జరిగింది అని చెప్పారు.విశ్వవిద్యాలయం లో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉద్యోగం సాధించి బయటకు వెళ్లేలా క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించి గత ఏడాది నూరు శాతం ఉద్యోగాలు ఇప్పించడం జరిగింది అన్నారు. రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ల చేతులమీదుగా నియామక పత్రాలు అందచేయడం జరిగిందని వివరించారు.ఈ ఏడాది కాలంలో స్నాతకోత్సవం, కృష్ణా తరంగ్ యూత్ ఫెస్టివల్ విజయవంతంగా నిర్వహించడం తో పాటు ఇప్పుడు విజయవాడ లో అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల నెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించబడుతోంది అని చెప్పారు.ఎన్ టి ఆర్ జిల్లా విద్యార్థుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విజయవాడలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సెంటర్ ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నాటికి బాలికల వసతి గృహం, ఫార్మసీ కళాశాల భవనాలను ప్రారభిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఫుడ్ కోర్టు ను ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో రెక్టర్ ఆచార్య ఎంవి. బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష లు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు.

# కేటీఆర్ మెడకు ఈ ఫార్ములా

హైదరాబాద్, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)
ఇన్ని రోజులపాటు ఫోన్ ట్యాపింగ్ కేసును తెరపైకి తీసుకువచ్చి.. కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావు, కెసిఆర్ వంటి వారిని విచారించింది తెలంగాణ ప్రభుత్వం. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత.. అవన్నీ కూడా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వచ్చిన తర్వాత.. ఈసారి ప్రభుత్వం మరింత వేగంగా అడుగులు వేయడం మొదలుపెట్టింది.భారత రాష్ట్ర సమితిలో కార్య నిర్వాహక అధ్యక్షుడిగా కొనసాగుతున్న కేటీఆర్ పై మరింత ఒత్తిడి తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుం బిగించారు. కేటీఆర్ పురపాలక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఫార్ములా ఈ కార్ రేస్ జరిగింది. అందులో కుంభకోణం జరిగిందని.. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ కంపెనీకి.. తెలంగాణ ప్రభుత్వం నిధులు పంపించిందని.. ఇందులో చీకటి వ్యవహారం దాగి ఉందని ప్రస్తుత రేవంత్ సర్కార్ ఆరోపిస్తోంది.ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఇప్పటికే ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను విచారించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో ఏసీబీ మరో రెండు రోజుల్లో ఛార్జ్ షీట్ దాఖలు చేస్తుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అరవింద్ కుమార్ ను విచారించడానికి కేంద్రం అనుమతి ఇవ్వడం విశేషం.2023లో హైదరాబాద్ నగరంలో ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహించారు. దీనికి సంబంధించి ఓ విదేశీ సంస్థకు నిబంధనలు పక్కనపెట్టి నిధులు చెల్లించారు. తద్వారా 54.88 కోట్ల నష్టం ప్రభుత్వానికి వాటిల్లిందని ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలోనే నాడు మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాలు జారీ చేయడం వల్లే విదేశీ సంస్థకు నిధులు మంజూరు చేశామని.. నాటి పురపాలకు శాఖ స్పెషల్ సెక్రటరీ అరవింద్ కుమార్ ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా స్టేట్మెంట్ కూడా ఇచ్చారు.అప్పట్లో ఏసీబీ విచారణ నిర్వహించినప్పుడు అరవింద్ కుమార్ ఇదే విషయాన్ని అంగీకరించారు . ఈ కేసులో కేటీఆర్ ను విచారించడానికి గవర్నర్ గతంలోనే అనుమతి ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన తర్వాత.. ఆ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వచ్చిన తర్వాత.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖంగా ఈ కేసు మీద దృష్టి సారించినట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డికి అనేక సందర్భాలలో కేటీఆర్ సవాళ్లు విసిరారు. పొట్టోడు అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ కేసును తెరపైకి తీసుకొచ్చారని ప్రచారం జరుగుతుంది. అన్ని విధాలుగా పరిశీలించిన తర్వాత ఈ కేసును ప్రభుత్వం వ్యూహాత్మకంగా తెరపైకి తీసుకు వచ్చిందని తెలుస్తోంది. అయితే అరవింద్ కుమార్ ను విచారించిన తర్వాత.. కేటీఆర్ ను విచారిస్తారని.. అనంతరం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటుందని ప్రచారం జరుగుతోంది.

# దోమలపై హైటెక్ యుద్ధం

కర్నూలు, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)

ప్రజారోగ్యానికి పెను సవాల్ విసురుతున్న దోమలపై హైటెక్ యుద్ధానికి ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. దోమల నియంత్రణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు ఉపయోగించనుంది. ఏఐ ఆధారంగా పనిచేసే స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ ద్వారా దోమలను కట్టడి చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతిలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని పరిశీలించనున్నారు. అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా మరిన్ని నగరాలకు విస్తరించాలనే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది. తిరుపతిలో ప్రైవేట్ సంస్థకు ఈ పనులు అప్పగించనున్నారు.దోమలు.. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా.. ప్రతి ఒక్కరినీ వేధిస్తున్న సమస్య. ప్రజారోగ్యానికి ప్రధాన సవాలు విసురుతున్నవి దోమలే.. ఈ నేపథ్యంలో దోమలపై హైటెక్ యుద్ధానికి ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. టెక్నాలజీ సాయంతో దోమలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. అందులో భాగంగా కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే స్మార్ట్ దోమల నిఘా వ్యవస్థ (స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్) అందుబాటులోకి తెస్తోంది ఏపీ ప్రభుత్వం. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో తొలుత ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నారు. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ విస్తరించే ఆలోచనలు చేస్తున్నారు.స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్‌లో భాగంగా తొలుత ముందుగా నిర్ణయించిన కొన్ని ప్రాంతాలలో ఐవోటీ పరికరాలు ఏర్పాటు చేస్తారు. ఈ పరికరాలు ప్రత్యేకమైన వాసన కలిగి ఉంటాయి. ఫిరమోన్ సాయంతో ఈ ప్రత్యేక వాసన వచ్చేలా అధికారులు వీటిని రూపొందించారు. దీంతో దోమలను ఇవి సులువుగా ఆకర్షిస్తాయి. దీని ద్వారా ఆ ప్రాంతంలో దోమల సాంద్రత ఎలా ఉంది.. అవి ఏ జాతి దోమలు, వాటి లింగం ఏంటనే వివరాలను ఈ ఐవోటీ పరికరాలు గుర్తిస్తాయి. ఈ సమాచారాన్ని వెంటనే సెంట్రల్ డ్యాష్ బోర్డుకు పంపిస్తుంది. ఈ డ్యాష్ బోర్డు.. ఏఐ సాయంతో ఈ వివరాలను విశ్లేషించి.. ఆ ప్రాంతంలో దోమల తీవ్రత ఎలా ఉందనే దానిపై అధికారులను అప్రమత్తం చేస్తుంది. ఆ తర్వాత దోమల నియంత్రణ కోసం డ్రోన్ల సాయంతో మందులను పిచికారీ చేసేలా ప్రణాళికలు రచించారు.మరోపతి తిరుపతిలో దోమలు అధికంగా ఉండే 250 హాట్‌స్పాట్లు గుర్తించారు. వీటిలోని కొన్ని ప్రాంతాలలో జాప్ ట్రాపులు, ఐవోటీ సెన్సార్లు ఏర్పాటు చేయనున్నారు. 20 లక్షలతో నాలుగుచోట్ల ఈ పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే తిరుపతిలో ఈ పనులను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించనున్నారు. ఈ నాలుగుచోట్ల వచ్చే ఫలితాల ఆధారంగా తిరుపతి మొత్తం ఈ సేవలు విస్తరించే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్‌ను తిరుపతితో పాటుగా విశాఖ, విజయవాడ, కర్నూలు, కాకినాడ, నెల్లూరు, రాజమండ్రి ప్రాంతాల్లో అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

# హిందూపురంలో షాకింగ్ వీడియో

**అనంతపురం, ఫిబ్రవరి 16, (లక్ష్యం న్యూస్)**

సమాజంలో మహిళల పట్ల, చిన్నారుల పట్ల అమానుషాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఇవి వెలుగు చూస్తున్నా.. పోలీసులు కఠిన చర్యలకు దిగుతున్నా నియంత్రణలోకి రావడం లేదు. ఈ లైంగిక వేధింపులకు సంబంధించి రాజకీయ నేతలపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. అటువంటిదే మరో ఘటన సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం నియోజకవర్గంలో ఓ మైనర్ బాలికపై.. ఓ పార్టీకి చెందిన గ్రామ నాయకుడు వేధింపులకు దిగాడు. వికృత చేష్టలకు పాల్పడ్డాడు. సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి అఘాయిత్యానికి ప్రయత్నించాడు. ప్రస్తుతం ఈ వీడియో విపరీతంగా వైరల్ అవుతోంది.ఇటీవల మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రధానంగా రాజకీయ పార్టీల నేతలు ఈ వేధింపులకు దిగుతున్నారు. బాధితులుగా మారుతున్న వారు ఆ వీడియోలను బయటపెట్టి న్యాయం చేయాలని కోరుతున్నారు. మరోవైపు నేరాలకు పాల్పడుతున్న వారు ఆ వీడియోలను తీసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఈ క్రమంలో ఆ వీడియోలు బయటకు వస్తున్నాయి. అయితే ఈ మొత్తం వ్యవహారంలో మహిళలు, చిన్నారులు బాధితులుగా ఉండగా.. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రత్యర్థులు ఈ వీడియోలను వైరల్ చేస్తున్నారు.హిందూపురం నియోజకవర్గంలో ఓ గ్రామానికి చెందిన చోటా నాయకుడు.. ఓ మైనర్ బాలిక పట్ల అమానుషంగా ప్రదర్శించాడు. అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక దాడికి ప్రయత్నిస్తున్న వీడియోలు ఇప్పుడు బయటకు వచ్చాయి. సదరు నాయకుడు పాఠశాలకు వెళ్తున్న బాలికను ట్రాప్ చేసి.. ఓ ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి ప్రయత్నించే క్రమంలో.. వికృత చేష్టలకు పాల్పడ్డాడు. అలా చేసి సెల్‌ఫోన్లో చిత్రీకరించి.. తిరిగి బాధితురాలను బ్లాక్ మెయిల్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ వీడియోలు బయటకు రావడంతో.. సదరు నేతపట్ల ఆరోపణలు వచ్చి పడుతున్నాయి. ప్రధాన నాయకుడికి అనుచరుడిగా ప్రచారం నడుస్తోంది.

# కాంగ్రెస్‌ను ఓడించే పని ప్రారంభించిన కాంగ్రెస్ నేతలు

## మణిశంకర్ అయ్యర్‌తో స్టార్ట్ !

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)

అస్సాం నుండి కేరళ వరకు కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న తాజా పరిణామాలు ఆ పార్టీ అంతర్గత సంక్షోభాన్ని మరోసారి బట్టబయలు చేశాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల నగారా మోగకముందే నాయకుల మధ్య మొదలైన విభేదాలు, వివాదాస్పద వ్యాఖ్యలు పార్టీకి పెద్ద తలనెప్పిగా మారాయి. అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు భూపేన్ బోరా తన పదవికి రాజీనామా చేస్తూ ఆత్మగౌరవం దెబ్బతిందని వ్యాఖ్యానించడం పార్టీలో పెను ప్రకంపనలు సృష్టించింది. అధిష్టానం జోక్యం చేసుకుని ఆయనను బుజ్జగించడంతో రాజీనామా వెనక్కి తీసుకున్నప్పటికీ, పార్టీలో ఉన్న విభేదాలు మాత్రం సమసిపోలేదు. రాష్ట్ర యూనిట్‌లో గౌరవ్ గొగోయ్, రాకిబుల్ హుస్సేన్ వంటి ఇతర కీలక నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుండటం వల్ల, ఎన్నికల నాటికి కేడర్ ఏకతాటిపైకి రావడం కష్టంగా కనిపిస్తోందకాంగ్రెస్ గెలుపుపై గట్టి ఆశలు పెట్టుకున్న కేరళలో, సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అద్భుతమైన నాయకుడని, వచ్చే ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. సొంత కూటమి గెలుపు కోసం పోరాడాల్సిన సమయంలో, మిత్రధర్మాన్ని విస్మరించి ప్రత్యర్థిని కొనియాడటం కేడర్ మనోధైర్యాన్ని దెబ్బతీసింది.మణిశంకర్ అయ్యర్ కేవలం రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కాకుండా, రాహుల్ గాంధీ నాయకత్వ శైలిని కూడా పరోక్షంగా విమర్శిస్తున్నారు. పార్టీలో జరుగుతున్న తప్పులను ఎత్తిచూపుతూనే, ఒక రకమైన నిరాశ ను తన మాటల్లో వ్యక్తం చేశారు. పార్టీలో ఉత్పన్నమవుతున్న ఇలాంటి అంతర్గత విభేదాలను, కీలక నేతల అసంతృప్తిని పరిష్కరించే ఒక శక్తివంతమైన ట్రబుల్ షూటర్ ' నాయకత్వ స్థాయిలో కనిపించకపోవడం కాంగ్రెస్‌కు ఉన్న అతిపెద్ద బలహీనతగా మారింది. మొత్తంగా చూస్తే, కాంగ్రెస్ పార్టీ బయటి శత్రువుల కంటే లోపల ఉన్న విభేదాల వల్లే ఎక్కువ నష్టపోతోంది. నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం, రాష్ట్ర స్థాయి నేతలు ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం ప్రయత్నించడం పార్టీని క్రమంగా బలహీనపరుస్తోంది. ఈ అంతర్గత చిచ్చును ఆర్పకపోతే, రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ తనను తాను ఓడించుకునే బాటలో పయనించడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# 15 ఏళ్ల అమ్మాయిలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)**

మీకు 14 ఏళ్లు నిండి 15 ఏళ్ల వయసున్న అమ్మాయిలు ఉన్నారా? అయితే మీకో అలర్ట్. త్వరలోనే తెలంగాణ ప్రభుత్వం మీ అమ్మాయిలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను వేయించనుంది. రాష్ట్రంలో మొత్తం 4 లక్షల మందికిపైగా ఈ వయసు ఉన్న కిశోర బాలికలు ఉన్నారని గుర్తించారు. వీరందరికీ టీకాలు వేయనున్నారు. అసలు ఈ వ్యాక్సిన్ ఎందుకు వేయిస్తారు..మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 14 నుంచి 15 ఏళ్ల వయసున్న బాలికల కోసం కేంద్రంతో కలిసి ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ వయసున్న బాలికలు రాష్ట్రంలో 4 .60 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. వ్యాక్సినేషన్ చేపట్టడానికి ముందు మైక్రో ప్లానింగ్ సర్వే నిర్వహించనున్నారు. దీని ద్వారా ఈ వయసున్న అమ్మాయిలు స్కూళ్లలో ఎంత మంది ఉన్నారు, బయట ఎంత మంది ఉన్నారనే వివరాలను సమగ్రంగా సేకరిస్తారు.తెలంగాణలోని క్యాన్సర్ కేసులను పరిశీలిస్తే.. మహిళల్లో ఎక్కువ మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతుండగా.. ఆ తర్వాతి స్థానంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఉంది. దీన్నే సర్వైకల్ క్యాన్సర్ అని పిలుస్తారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌ను సమర్థవంతంగా అడ్డుకోవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. మహిళలకు సోకే సర్వైకల్ క్యాన్సర్లలో 85 నుంచి 90 శాతం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వల్లే సోకుతోంది.ఎక్కువసార్లు ప్రసవాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, చిన్న వయసులోనే పెళ్లి కావడం, లైంగిక సంబంధాల వల్ల హ్యూమన్ పాపిలోమా వైరస్ సోకుతుంది. అయితే ఇది సోకిన వెంటనే క్యాన్సర్ రాదు. వైరస్ సోకిన 10-15 ఏళ్ల తర్వాత మహిళల్లో క్యాన్సర్ బయటపడుతుంది. దీంతో అమ్మాయిలు యుక్త వయసులోకి వచ్చిన తర్వాత, లైంగిక జీవితాన్ని ప్రారంభించడానికి ముందు హెచ్‌పీవీ టీకాలు వేయిస్తే.. క్యాన్సర్‌ను అరికట్టడంలో మంచి ఫలితం ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు.సర్వైకల్ క్యాన్సర్ తొలి దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు అందుకే దీన్ని సైలెంట్ కిల్లర్ అని పిలుస్తారు. వ్యాధి ముదురుతున్న కొద్దీ లక్షణాలు ఒక్కొక్కటిగా బయటపడతాయి. వ్యాధి బారిన పడ్డామని గ్రహించేలోపే అది ముదిరిపోతోంది. దీని వల్ల చికిత్స ఖర్చు పెరిగిపోవడంతోపాటు ప్రాణాలు కాపాడటం కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి కిశోర బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వడం ఉత్తమ పరిష్కారంగా డాక్టర్లు చెబుతున్నారు. 30 ఏళ్ల వయసు దాటిన మహిళలు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచిస్తున్నారు.హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను బయట కొనుగోలు చేయాలంటే.. ఒక్కో డోసుకు కనీసం రూ.2 వేల నుంచి గరిష్టంగా రూ.4 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. 15 ఏళ్లు వచ్చిన అమ్మాయిలకు మూడు డోసుల వ్యాక్సిన్ ఇస్తారు. ఇది తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం అవుతుంది. దీంతో ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం వైద్య ఆరోగ్య శాఖ ఇప్పటికే ఏర్పా?ట్లు పూర్తి చేసింది. టీకాలు పంపిణీ చేసే సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు.

# రాజకీయామా నీదే పార్టీ

హైదరాబాద్, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత విచిత్రమైన , ఆసక్తికరమైన సమీకరణాలకు తెరలేపాయి. సిద్ధాంతపరంగా బద్ధశత్రువులుగా కనిపించే పార్టీలు క్షేత్రస్థాయిలో అధికారం కోసం చేతులు కలపడం 'అవకాశవాద రాజకీయం'గా కనిపిస్తున్నా, దీని వెనుక లోతైన వ్యూహాలు దాగి ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల కంటే స్థానిక గెలుపు గుర్రాలే కీలకం కావడంతో చాలా చోట్ల అనూహ్య పొత్తులు కనిపించాయి. బీజేపీ-కాంగ్రెస్, బీఆర్ఎస్-బీజేపీ వంటి అసంభవమైన కలయికలు కొన్ని మున్సిపాలిటీల్లో అధికార పీఠాలను కైవసం చేసుకున్నాయి. నిజామాబాద్ వంటి చోట్ల కాంగ్రెస్-మజ్లిస్ జతకట్టడం గమనార్హం. రాష్ట్ర స్థాయిలో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నా, స్థానిక కౌన్సిలర్లు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి పార్టీల మధ్య ఉన్న గీతలను చెరిపివేశారు.బీఆర్ఎస్ నేత హరీష్ రావు వంటి వారు ఇతర పార్టీల అనైతిక పొత్తులపై విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, స్థానిక సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల్లో నాయకత్వం వ్యక్తిగత ప్రాబల్యంపై ఆధారపడి ఉంటుంది. అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల నాటికి ఈ సమీకరణాలు మారిపోయి, మళ్ళీ ఆయా పార్టీల అధిష్టానాల ఆదేశాల మేరకు రాజకీయాలు నడుస్తాయి. అయితే ఈ మున్సిపల్ ఎన్నికలు పార్టీల మధ్య ఉన్న రాజకీయ అంటరానితనం పోయిందని స్పష్టం చేశాయి.ఈ ఎన్నికల తర్వాత అత్యంత ఆసక్తికరమైన చర్చ బీజేపీ - బీఆర్ఎస్ పొత్తు గురించి మొదలైంది. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే ఈ రెండు పార్టీలు కలవడం ద్వారా ఓటు బ్యాంక్ ఏకీకరణ జరుగుతుందని ఒక వర్గం అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల ఓట్ షేర్ కలిపితే అది అధికార పార్టీ కంటే ఎక్కువగా ఉండటమే ఈ చర్చకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ఈ రహస్య లేదా బహిరంగ పొత్తు మున్సిపల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లే అవకాశం ఉందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో, బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టును కలిపితే బలమైన శక్తిగా ఎదగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, ఉమ్మడి శత్రువును ఓడించడానికి రెండు పార్టీలు చేతులు కలపడం వ్యూహాత్మకంగా లాభిస్తుంది. అయితే, ఈ పొత్తు వల్ల ఇరు పార్టీల సిద్ధాంతాలకు తూట్లు పొడిచినట్లవుతుందనే భయం కూడా నాయకత్వాల్లో ఉంది. మైనారిటీ ఓట్లు కోల్పోతామనే భయం బీఆర్ఎస్‌కు ఉంటే, హిందుత్వ ఓటు బ్యాంకులో చీలిక వస్తుందేమోనన్న ఆందోళన బీజేపీలో ఉంది.రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలు పొత్తుల గురించి ఆలోచన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే, తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరమని ఈ మున్సిపల్ ఫలితాలు నిరూపించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయం ఎప్పుడూ అధికారం చుట్టూనే తిరుగుతుంది కాబట్టి, భవిష్యత్తులో బీజేపీ-బీఆర్ఎస్ కలిసి పనిచేయడం అనేది అసాధ్యమేమీ కాదు. అయితే అది బహిరంగ పొత్తుగా ఉంటుందా లేదా లోపాయికారి ఒప్పందంగా ఉంటుందా అనేది కాలమే నిర్ణయించాలి.

# 3 నగరాల్లో ఫుడ్ స్ట్రీట్స్...

వరంగల్ ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)

తెలంగాణలోని హన్మకొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల ప్రజలకు గుడ్ న్యూస్. సాయంత్రం కుటుంబంతో కలిసి స్ట్రీట్ ఫుడ్‌ను ఎంజాయ్ చేసేలా ఈ మూడు నగరాల్లో త్వరలోనే హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే దీని కోసం స్థలాల అన్వేషణ పూర్తి కాగా.. త్వరలోనే మిగతా ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ఫుడ్ స్ట్రీట్లలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని భావించే వారు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.చాలా మందికి స్ట్రీట్ ఫుడ్ అంటే ఇష్టం. సాయంత్రం అయితే చాలు బజ్జీలు, పునుగులు, పానీపూరీ.. ఇలా ఏదో ఒకటి లాగించకపోతే మనసు ఊరుకోదు. అయితే వాటిని తయారు చేయడానికి ఎలాంటి పదార్థాలు వాడుతున్నారు? వాటిని విక్రయించే ప్రదేశాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంటాయో లేవో అనే భయం చాలా మందికి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రజలకు హైజనిక్ స్ట్రీట్ ఫుడ్ అందేలా చూడటం కోసం కేంద్రం ప్రభుత్వం కీలక ప్రయత్నం చేస్తోంది. దేశవ్యాప్తంగా 100 హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 86 సెంటర్లకు అనుమతులు ఇచ్చింది. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ఒక్కో సెంటర్ కోసం కోటి రూపాయలు చొప్పున నిధులు మంజూరు చేస్తోందిఈ క్రమంలోనే తెలంగాణలోని హనుమకొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల్లో హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ నగరాల్లో ఫుడ్ స్ట్రీట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను సైతం గుర్తించారు. సామాన్య ప్రజలు ఆహారం క్వాలిటీ గురించి, అందులో వాడిన పదార్థాల గురించి ఎలాంటి భయం లేకుండా.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఫుడ్‌ను ఎంజాయ్ చేసేలా ఫుడ్ స్ట్రీట్స్ ఉంటాయి. దుమ్ము ధూళితో ఇబ్బంది లేకుండా చూడటం కోసం, సులభంగా శుభ్రం చేసేందుకు వీలుగా ఫుడ్ స్ట్రీట్స్ ప్రాంగణం మొత్తం టైల్స్ వేస్తారు. రాత్రి టైంలో ఆకర్షణీయమైన లైటింగ్‌ను సైతం ఏర్పాటు చేయనున్నారు.ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్ ఉన్న వారికి మాత్రమే ఫుడ్ స్ట్రీట్స్‌లో స్టాల్స్ కేటాయిస్తారు. ఈమేరకు నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూస్తారు. ఆహార పదార్థాలను ఎలా జాగ్రత్తపర్చాలి, పరిశుభ్రంగా ఎలా ఉండాలనే విషయమై వెండర్లకు ట్రైనింగ్ కూడా ఇవ్వనున్నారు. ఈ స్టాల్స్‌లో వంట చేసే వారు, ఆహారాన్ని అందించేవారు తప్పనిసరిగా చేతులకు గ్లోవ్స్ పెట్టుకోవాలి. వెంట్రుకలు ఆహారంలో పడకుండా తలకు ఆప్రాన్ పెట్టుకోవాలి. గోర్లు పెంచుకోవడం, వేళ్లకు ఉంగరాలు పెట్టుకోవడం కుదరదు. పొగాకు నమలడం, సిగరెట్లు, బీడీలు కాల్చడం నిషేధం. ఆహార పదార్థాల తయారీకి వాడే ముడిసరుకులతోపాటు, ఫుడ్ ఐటెమ్స్ క్వాలిటీని ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు.అంతే కాదు ఈ ఫుడ్ స్ట్రీట్స్‌లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి కస్టమర్లు తాగడానికి శుద్ధ జలాన్ని అందిస్తారు. చేతులు శుభ్రం చేసుకోవడానికి ప్రత్యేకంగా వాష్ ఏరియాలు ఉంటాయి. ఫ్యామిలీతో సరదాగా టైం గడుపుతూ, ఫుడ్‌ను ఎంజాయ్ చేయడం కోసం బెంచీలను ఏర్పాటు చేస్తారు.

# ఆర్గానిక్ వస్తువుల కోసం యాప్

హైదరాబాద్, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)

బః తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. సేంద్రియ ఉత్పత్తులకు ప్రత్యేక యాప్ తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ను సిద్ధం చేస్తోంది. నకిలీల నుంచి విముక్తి కల్పించేలా యాప్ తీసుకొస్తున్నారు. ఈ యాప్‌లో సమగ్ర సమాచారం ఉండేలా ప్లాన్ చేశారు. అటు రైతులు, ఇటు ప్రజలకు ఉపయోగంగా ఉండేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఈ యాప్ అందుబాటులోకి వస్తుంది అంటున్నారు.తెలంగాణలో రైతులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. కొంతకాలంగా ప్రజలు ఆర్గానిక్ ఉత్పత్తులు ఉపయోగిస్తున్నారు.. కొంతకాలంగా విక్రాలు కూడా పెరిగాయి. ఇదే క్రమంలో ఆర్గానిక్ పేరుతో నకిలీవి కూడా మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.. అసలు ఏదో, నకిలీవి ఏవో తెలియడం లేదు.. రైతులు కూడా ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. ఓ యాప్‌ను తీసుకొస్తోంది. త్వరలోనే ఆర్గానిక్ యాప్‌ను సిద్ధం చేస్తామని అధికారులు చెబుతున్నారు. రైతులు వారి ఉత్పత్తులతో ఆదాయం పెంచుకునేందుకు ఈయాప్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. సాగును ప్రోత్సహించేందుకు రాయితీలూ ఇవ్వనుంది.తెలంగాణలో 50వేల ఎకరాల్లో 10వేలమంది వరకు రైతులు ఆర్గానిక్ వ్యసాయం చేస్తున్నారు. వరితో పాటుగా కూరగాయలు, నూనె గింజలు, పప్పుధాన్యాలు సాగు చేస్తున్నారు. మరికొందరు రైతులు పండ్ల తోటలు కూడా సాగు చేస్తున్నారు. రైతులు ఈ ఆర్గానిక్ సాగు కోసం ఎలాంటి పురుగుల మందు, ఎరువులు, ఇతర కెమికల్స్ ఉపయోగించరు. కేవలం జీవ పదార్థాలతో పంటల్ని సాగు చేస్తారు. అయితే పంట చేతికి వచ్చిన తర్వాత మార్కెటింగ్ ఎలా చేయాలో తెలియని పరిస్థితి. వీరు షాపులు, షాపింగ్ మాల్స్, షాపులకు ఈ ఉత్పత్తుల్ని పంపిస్తారు. ఆర్గానిక్ ఉత్పత్తుల్ని పెద్దగా ఎగుమతి కూడా చేయడం లేదు.ఆర్గానిక్ విత్తనాలు, ఉత్పత్తులకు 2015లో టీఎస్ఎం-వోసీఏ (తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ) ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆర్గానిక్ ఉత్పత్తుల కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.. లైసెన్స్ వచ్చిన తర్వాత లేబుల్స్‌తో ఈ ఉత్పత్తుల్ని విక్రయించాల్సి ఉంటుంది. అయితే తెలంగాణలో 200 సంస్థలు లైసెన్సులు తీసుకున్నాయి. రైతులు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే చాలామంది రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడం లేదు. కొందరు రైతులు వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సమస్యను వివరించారు. తాము నకిలీ ఉత్పత్తుల కారణంగా నష్టపోతున్నామని మంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో స్పెషల్‌గా యాప్ తీసుకురావాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ క్రమంలో యాప్‌ను సిద్ధం చేస్తున్నారు.టీఎస్ఎస్‌వోసీఏ (తెలంగాణ విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ) యాప్ ద్వారా సమాచారాన్ని పొందుపరుస్తారు. ఈ మేరకు రాష్ట్రంలో ఏ రైతు, ఏ పంట సాగు చేస్తున్నారో, ఎక్కడ సాగు చేస్తున్నారో, ఆ ఉత్పత్తులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో వివరాలు అందుబాటులో ఉంటాయి. రైతుల సమాచారం (అడ్రస్, మొబైల్ నంబర్, ఫోటోలు, వీడియోలు) నమోదు చేస్తారు. ఈ యాప్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన యాప్‌ను కనెక్ట్ చేస్తారు. ఆర్గానిక్ ఉత్పత్తులు కొనుగోలు చేయడం.. ఎగుమతుల సంస్థల వివరాలు కూడా ఉంటాయి. ఉత్పత్తులకు సంబంధించిన వివరాలు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి.

# గ్రేటర్ కోసం పక్కా వ్యూహం

హైదరాబాద్, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ఇంట్రెస్టింగ్ డిస్కషన్‌కు దారితీశాయి. ఈ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చాలా సీరియస్‌గా ఫోకస్ చేసింది. ఎన్నికల సైరన్ మోగక ముందే..ఒక్కో పార్లమెంట్ సెగ్మెంట్‌కు మంత్రులను ఇంచార్జ్‌లుగా నియమించి..ఎప్పటికప్పుడు సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు చేశారు. ఎన్నికలు జరిగేంత వరకు సీరియస్‌గా ఫాలో అప్ చేయడంతో..మెరుగైన ఫలితాలు సాధించింది హస్తం పార్టీ.కొన్ని చోట్ల హంగ్ వచ్చిన వాటిని కూడా నయానో బయానో తమ ఖాతాలోకి వేసుకోగలిగింది కాంగ్రెస్. కానీ హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న మున్సిపాలిటీల్లో వచ్చిన రిజల్ట్స్ కాంగ్రెస్‌ను కలవరపెడుతున్నాయట. తాము సీరియస్‌గా ఎంత ఫోకస్ చేసినా..హైదరాబాద్ చుట్టూ ఉన్న మున్సిపాలిటీల్లో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేయడంతో..ఫలితాలు ఇలా ఎందుకు వచ్చాయని ఆరా తీస్తున్నారట హస్తం పార్టీ నేతలు.గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కలున్న నియోజకవర్గాల్లో కూడా ఖాతా తెరవలేకపోయింది. గ్రేటర్ పరిధిలోని 23 అసెంబ్లీ సెగ్మెంట్లతో పాటు పక్కనున్న చేవెళ్ల, మహేశ్వరం, మేడ్చల్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కట్టారు. దాంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక..గ్రేటర్ హైదరాబాద్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టి పనిచేస్తున్నారు హస్తం పార్టీ లీడర్లు.రాష్ట్రానికి గుండెకాయ లాంటి హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో పట్టు సాధించేందుకు అన్ని అస్త్రాలను వాడుతున్నారు. హైదరాబాద్ విషయంలో పాలనా పరమైన సంస్కరణలు తీసుకొచ్చింది ప్రభుత్వం. ఔటర్ రింగ్ రోడ్డు వరకు హైదరాబాద్‌ను విస్తరించి ఉన్న ఏరియాను కోర్..రిజనల్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి ఉన్న ప్రాంతాన్ని ప్యూర్, మిగతా తెలంగాణ ప్రాంతాన్ని రేర్‌గా విభజిస్తూ..పరిపాలనకు శ్రీకారం చుట్టింది. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు తోడుగా కొత్తగా ఫ్యూచర్ సిటీని డెవలప్ చేసే పనిలో పడింది.హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలపై ఇంత ఫోకస్ పెట్టినా.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆశించిన ఫలితాలు రాలేదు. ఎంతో గొప్పగా చెప్పుకునే ఫ్యూచర్ సిటీ ఏరియాలో ఉండే ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని కూడా కాంగ్రెస్ గెలుచుకోలేకపోయింది. ఇక్కడ బీఆర్ఎస్ మెజారిటీ సాధించింది. ఫ్యూచర్ సిటీకి పక్కనే ఉన్న కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమన్‌గల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ ఆధిక్యత ప్రదర్శించింది.కానీ బీఆర్ఎస్ కౌన్సిలర్‌ను తమవైపునకు తిప్పుకుని కారు పార్టీ నేతకు ఛైర్మన్ పోస్ట్ ఇచ్చి పరువు నిలబెట్టుకునే ప్రయత్నం చేసింది కాంగ్రెస్. అలాగే మేడ్చల్ జిల్లాలో ఉన్న మూడు మున్సిపాలిటీలు కూడా హస్తం పార్టీకి దక్కలేదు. మూడు చింతలపల్లి, ఎల్లంపేట్, అలియాబాద్ మున్సిపాలిటీలలో ఒక్క అలియాబాద్ మాత్రమే కాంగ్రెస్‌కు దక్కింది. మిగతా రెండుచోట్ల బీఆర్ఎస్ కైవసం చేసుకుంది.చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్‌లో మెజారిటీ లేకపోయినా..ఇండిపెండెంట్ అభ్యర్థులతో కలిసి పీఠాన్ని చేజిక్కించుకుంది కాంగ్రెస్. పటాన్ చెరు నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో కారు జోరు కాంగ్రెస్‌కు కంటిమీద కనుకు లేకుండా చేస్తోందట. ఇక పరిగి, వికారాబాద్ మున్సిపాలిటీలలో పూర్తిస్థాయి మెజారిటీ సాధించలేకపోయింది హస్తం పార్టీ.హైదరాబాద్ చుట్టుపక్కల చాలాచోట్ల ఇప్పటికీ పట్టు సాధించకపోవడంతో హస్తం పార్టీ నాయకత్వం ఆలోచనలో పడిందట. ఇంత చేసినా..మున్సిపాలిటీల్లో ఇలాంటి ఫలితాలు రావడంతో..అసంతృప్తితో ఉన్నారట. సిటీ శివారు ప్రాంతాల్లో వచ్చిన ఫలితాల ఎఫెక్ట్..రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎఫెక్ట్ పడే ప్రమాదం ఉందని భావిస్తున్నారట.జీహెచ్ఎంసీ ఎన్నికలకు రెడీ అవుతున్న కాంగ్రెస్ పార్టీని..హైదరాబాద్‌లో నాయకత్వం లేమి సమస్య ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీన్ని అధిగమించేందుకు రాష్ట్ర నాయకత్వం ఒక ప్లాన్ చేస్తోందట. ఉఊఓఆ కాల పరిమితి ముగిసినా..ఆరు నెలల సమయం తీసుకొని..పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి..ప్రజల్లోకి వెళ్లాలనుకుంటుందట. ఆరు నెలల్లో పరిస్థితిని తమ ఆధీనంలోకి తెచ్చుకున్న తర్వాతే ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన చేస్తోందట హస్తం పార్టీ.గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం ఇప్పటికే కొన్ని సంస్కరణలు తీసుకొచ్చి..ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి..మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. విభజిత జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లకు కూడా ఆరు నెలల తర్వాతే ఎన్నికలు పెట్టాలని చూస్తోంది. ఆరు నెలల తర్వాతైనా అధికార కాంగ్రెస్ పట్టు సాధిస్తుందా.? లేక పరిస్థితులు అనుకూలంగా లేవని కార్పొరేషన్ ఎన్నికలపై మళ్లీ ఆలోచనలో పడుతుందా అనేది వేచి చూడాలి.

# జీవన్ రెడ్డికి కాంగ్రెస్ షాక్..

**కరీంనగర్, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)**

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం కోసం కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాలు తీవ్రంగా ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు తమ వర్గానికి చెందిన వారికే చైర్మన్ పదవి ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో కాంగ్రెస్ పెద్దలు రంగంలోకి వారి మధ్య సయోధ్య కుదర్చేందుకు చర్చలు జరిపారు. చివరికి కాంగ్రెస్ అధిష్టానం ఆ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డికి బిగ్ షాకిచ్చింది. జగిత్యాల చైర్మన్ పీఠం సంజయ్ వర్గానికే కట్టబెడుతూ నిర్ణయించింది.జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలంటే కనీసం 25 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 23 చోట్ల, స్వతంత్రులు 15 చోట్ల గెలుపొందారు. బీజేపీ ఆరు, బీఆర్ఎస్ నాలుగు, ఎంఐఎం రెండు స్థానాలు గెలుచుకుంది.కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గం నుంచి 33 మంది పోటీ చేయగా 14మంది, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వర్గం నుంచి 17 మంది పోటీ చేయగా తొమ్మిది మంది విజయం సాధించారు. స్వతంత్రుల్లో తొమ్మిది మంది జీవన్ రెడ్డి వర్గం కాగా.. నలుగురు ఎమ్మెల్యే వర్గీయులు, ముగ్గురు బీజేపీ రెబల్స్ ఉన్నారు.ఈ క్రమంలో చైర్మన్ పీఠం కోసం జీవన్ రెడ్డి, సంజయ్ కుమార్ పోటీ పడ్డారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలు రంగంలోకి దిగారు. జీవన్ రెడ్డితో పలు దఫాలుగా చర్చలు జరిపారు. ఈ చర్చల్లో భాగంగా సంజయ్ వర్గానికి చైర్‌పర్సన్ పదవి అప్పగించేందుకు నిర్ణయించారు.జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ గా సంజయ్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది. భవిష్యత్తులో జడ్పీటీసీ, మార్కెట్ కమిటీ పదవుల విషయంలో ప్రాధాన్యత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ పెద్దలు జీవన్ రెడ్డికి హామీ ఇవ్వడంతో ఆయన వెనక్కు తగ్గినట్లు తెలిసింది. దీంతో గత రెండు రోజులుగా జీవన్ రెడ్డి వర్సెస్ సంజయ్ కుమార్ మధ్య జరుగుతున్న వార్ లో పార్టీ పెద్దలతో సహకారంతో సంజయ్ కుమార్ పంతం నెగ్గించుకున్నట్లయింది.

# రోజుకో ఏడుగురు ఎమ్మెల్యేలతో భేటీ

**విజయవాడ, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)**

పవర్‌లోకి వచ్చి ఆల్రెడీ ఇరవై నెలలు అవుతుంది. ఇప్పటిదాకా అభివృద్ధి, సంక్షేమంపైనే ఫుల్ ఫోకస్ నడిచింది. త్వరలోనే స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎలక్షన్స్ రాబోతున్నాయ్. ఇప్పుడు పార్టీపై కాన్సన్‌ట్రేషన్ షిఫ్ట్ చేశారు సీఎం చంద్రబాబు నియోజకవర్గంలో సమస్యలు ఏంటి.?ప్రజల్లో ప్రభుత్వంపై ఎలాంటి ఒపీనియన్ ఉంది.? స్థానికంగా ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేశారా.? మీకేం కావాలి.? పార్టీ పరంగా ఏం చేయాలి.? ప్రభుత్వ పరంగా చేసి పెట్టాల్సిన పనులు ఏంటి.? మీ వ్యక్తిగత సమస్యలు ఏమైనా ఉన్నాయా.? అంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ముఖాముఖి నిర్వహిస్తున్నారు. సమస్యలు చెప్పుకునేందుకు..తప్పులు సరిదిద్దుకునేందుకు అవకాశం ఇవ్వలేదనే విమర్శలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకునే పనిలో పడ్డారట. అసలే అసెంబ్లీ బడ్జెట్ సెషన్ నడుస్తుంది.ఎమ్మెల్యేలంతా 9 గంటల వరకు సభలో ఉండాలని ఇప్పటికే బాబు ఆదేశించారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలంతా బడ్జెట్ సమావేశాలు అయిపోయే వరకు విజయవాడలోనే ఉండే అవకాశం ఉంది. దీంతో ఇదే సమయంలో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వరుసగా భేటీ అవుతూ..ఎక్కడిక్కడ సమస్యలకు చెక్ పెట్టి.. అంతా సెట్ చేసే ప్లాన్ చేస్తున్నారట.అటు మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతిరోజూ ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో డిన్నర్ మీట్ అవుతున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యే వరకూ ఈ భేటీలు జరగనున్నాయి. రోజూ ఒక్కో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, వారి కుటుంబసభ్యులతో నారా లోకేశ్ డిన్నర్ భేటీలు కంటిన్యూ కాబోతున్నాయి. నారా లోకేష్‌తో జరిగే ఈ డిన్నర్ మీట్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటుగా వారి కుటుంబసభ్యులు కూడా హాజరవుతున్నారుఈ విందు సమావేశాల్లో నియోజకవర్గాల్లోని సమస్యలపై చర్చించడంతో పాటు..ఎమ్మెల్యేలతో నేరుగా మాట్లాడే అవకాశం లభిస్తుందని నారా లోకేశ్ భావిస్తున్నారు. ఇలా అటు సీఎం చంద్రబాబు ప్రజాప్రతినిధులకు డైరెక్షన్స్ ఇస్తూ..ఫ్యూచర్ పాలిటిక్స్‌పై దిశానిర్దేశం చేస్తున్నారట. లోకేశ్ అయితే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బాండింగ్ పెంచుకునేలా..కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా చేస్తుంటే..ఎక్కడా అసంతృప్తులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారటగత ప్రభుత్వ హయాంలో సీఎం అపాయింట్మెంట్ దొరకడం లేదంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా గగ్గోలు పెట్టినట్లు కథనాలొచ్చాయి. పైగా తమ హయాంలో సీఎంవో నడపాల్సినంత గొప్పగా నడపలేకపోయామని వైసీపీ నేతలే చెప్తుంటారు. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుందనే ఆవేదనతో కొంతమంది ఎమ్మెల్యేలు కక్కలేక, మింగలేక మిన్నకుండిపోయి ఎన్నికల తర్వాత బరస్ట్ అయిపోయారు.మరికొందరు అయితే ముందు నుంచే ఆఫ్ ది రికార్డ్‌లో తమ ఆగ్రహాన్ని, ఫ్రస్ట్రేషన్‌ను వెళ్లగక్కిన సందర్భాలున్నాయి. అయితే తమ పార్టీలో, ప్రభుత్వంలో పరిస్థితికి తావు లేకుండా అటు సీఎం చంద్రబాబు, ఇటు మంత్రి లోకేశ్ సరికొత్త ఆలోచన చేశారని తెలుస్తోంది. తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అయినా పూర్తిగా కొన్ని గంటలు వ్యక్తిగతంగా, మరికొంత సమయం వారి కుటుంబ సభ్యులతోనూ కలిసినట్లు ఉండటంతో పాటు.. వారి నియోజకవర్గాల్లో సమస్యలు, పార్టీ పరిస్థితి, ప్రజల అభిప్రాయాలను లోతుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారట.ఈ అసెంబ్లీ సెషన్ పూర్తయ్యేలోపు డిన్నర్ విత్ లోకేశ్ కార్యక్రమం వైరల్‌గా మారే ఛాన్స్ ఉంది. అలా అని లోకేశ్ ప్రత్యేకత ఈ ఒక్క కార్యక్రమానికే పరిమితం కాదని..మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి "ఎక్స్" వేదికగా తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపైనా వెంటనే స్పందిస్తున్నారని గుర్తు చేస్తున్నారు.ఎక్స్‌లో తన దృష్టికి వచ్చిన సమస్యను..తన ఆఫీస్ టీమ్‌కు అసైన్ చేస్తున్నారు.. వారు ఫాలో అప్ చేసి, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని, సమస్యను సాల్వ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు డిన్నర్ మీట్‌తో నేరుగా సమావేశం అయి..గ్రూప్‌వార్..కమ్యూనికేషన్ గ్యాప్‌కు చెక్ పెట్టి..అక్కడక్కడ ఏమైనా అసంతృప్తులు, అలకలు ఉన్నా అంతా సెట్‌రైట్ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు

# 3 రకాల మెంబర్ షిప్ తో జనసేన

**విజయవాడ, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)**

జనసేన పార్టీ తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించేందుకు సరికొత్త సభ్యత్వ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో పార్టీలో మూడు రకాల సభ్యత్వ వర్గాలను నిర్ణయించింది. జనసేన పార్టీ తన శ్రేణులను మూడు విభాగాలుగా విభజించింది. మొదటి వారిని ఉద్యమి గా పిలుస్తారు. వీరు పార్టీపై నమ్మకం, అభిమానంతో ప్రాథమిక సభ్యత్వం తీసుకున్న వారు. రెండవ కేటగిరీకి చెందిన వారిని సాధక్ అని పిలుస్తారు. వీరు కేవలం సభ్యులుగానే కాకుండా, పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తూ, పార్టీ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే క్రియాశీలక పాత్ర పోషిస్తారు. ఇక మూడవ కేటగిరీలోకి ప్రధాతలు వస్తారు. వీరు పార్టీకి వివిధ రూపాల్లో ఆర్థికంగా లేదా మేధోపరంగా అండగా నిలుస్తూ, నాయకత్వ బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తారు.సభ్యత్వ నమోదు ప్రక్రియను పారదర్శకంగా మరియు సులభంగా నిర్వహించేందుకు జనసేన పార్టీ డిజిటల్ పద్ధతులను అవలంబిస్తోంది. ప్రతి సభ్యుని వివరాలను ఆన్‌లైన్ డేటాబేస్‌లో నిక్షిప్తం చేయడం ద్వారా, భవిష్యత్తులో వారికి ఇన్సూరెన్స్ వంటి ప్రయోజనాలను అందించాలని పార్టీ భావిస్తోంది. ముఖ్యంగా యువతను ఈ ఉద్యమి-సాధక్-ప్రధాత ' విధానం వైపు ఆకర్షించడం ద్వారా పార్టీలో జవాబుదారీతనం పెరుగుతుందని నాయకత్వం ఆశిస్తోంది.ఏపీలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రతి గ్రామం, వార్డులో జనసేన జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. సాధారణ సభ్యుల నుండి నాయకుల వరకు వారి పనితీరు , అంకితభావాన్ని బట్టి ఈ వర్గీకరణలో గుర్తింపు లభిస్తుంది. ఈ నూతన విధానం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపడంతో పాటు, క్రమశిక్షణతో కూడిన రాజకీయ వ్యవస్థను నిర్మించాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు.

# ఏప్రిల్ 1 నుంచి రైల్వే జోన్...

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)**

దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాలకు సంబంధించి కీలక ముందడుగు పడుతోంది. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటవుతున్న జోన్ కార్యకలపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులకు సమాచారం వచ్చినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 1న కొత్త రైల్వే జోన్?కు అపాయింటెడ్? డేగా ప్రకటించబోతున్నారట. ఈ నెలాఖరుకు ప్రకటన వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ముఖ్యంగా ఉత్తరాంధ్రవాసుల కల నెరవేరబోతోంది. కొత్త రైల్వే జోన్‌కు సంబంధించి అపాయింటెడ్ డేకు ముహూర్తం ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అన్ని కుదిరితే ఏప్రిల్ 1 నుంచి కొత్త రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే విభజన ప్రక్రియలో భాగంగా.. ఆరు డివిజన్లు విడిపోతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌లు మాత్రమే ఉంటాయి. కొత్తగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటు కాబోతోంది.. అందులో కొత్తగా ఏర్పడే విశాఖపట్నం డివిజన్, తూర్పుకోస్తా జోన్‌లో కొంతభాగం, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు కలిపి ఉంటాయి.కొత్తగా ఏర్పాటవుతున్న రైల్వే జోన్‌కు ఏప్రిల్ 1న అపాయింటెడ్ డేగా ప్రకటించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటి నుంచి చూస్తే ఆరు వారాల సమయం ఉంది.. మరి అంత తక్కువ సమయం సరిపోతుందా అనే అంశంపై కూడా తెరపైకి వచ్చింది. త్వరలోనే దీనిపై ఓ క్లారిటీ వస్తుందని.. ఈ నెలాఖరు లోపు కొత్త జోన్ అపాయింటెడ్ డేపై నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్నారు. రైల్వే బోర్డుకు తొమ్మిది నెలల క్రితమే డివిజన్ల వారీగా విభజన ప్రక్రియతో పాటుగా మిగిలిన అంశాలపై డీపీఆర్ పంపించారు. ఈ మేరకు విభజన ప్రక్రియను చేపట్టారు. ఈ నెలలోనే అపాయింటెడ్ డే ప్రకటిస్తారని భావిస్తున్నారు.కేంద్రం ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. గత పదేళ్లుగా కొత్త రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రం నుంచి వినతులు అందజేశారు. గతేడాది ఫిబ్రవరి నెలలో కేంద్ర కేబినెట్ కొత్త రైల్వే జోన్‌కు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కొత్త రైల్వే జోన్‌కు జీఎంతో పాటుగా అవసరమైన అధికారుల్ని, మిగిలిన కసరత్తును చేపట్టింది. ఈ మేరకు అవసరమైన సరిహద్దుల్లో మార్పులు చేర్పులు, రైళ్ల నిర్వహణ, ఆదాయ వ్యయాలు వంటి అంశాలపై కసరత్తు చేశారు. ఇప్పుడు అపాయింటెడ్ డేను ప్రకటించే దిశగా అడుగులుపడుతున్నాయి. అలాగే ఆయా డివిజన్లలో మార్పులు, చేర్పులు చేయనున్నారు.విశాఖపట్నంలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ జీఎం తాత్కాలిక కార్యాలయాన్ని సిరిపురంలో ఉన్న డెక్ భవనంలో ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ రెండు అంతస్తుల్ని లీజు కింద తీసుకున్నారు. అలాగే దక్షిణ కోస్తా రైల్వే జోన్ శాశ్వత ప్రధాన కార్యాలయం పనులు కూడా వేగవంతం అయ్యాయి. ముడసర్లోవలో ఏపీ సర్కార్ భూమిని కేటాయించగా.. అక్కడ పనులు ప్రారంభం అయ్యాయి.. గతేడాది జనవరిలో ప్రధాని మోదీ ఈ పనులకు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. మొత్తం 54 ఎకరాలను కార్యాలయం కోసం కేటాయించారు. రూ.192 కోట్లతో పరిపాలనా భవనానికి ఖర్చవుతుందని అంచనా వేశారు.. 12 అంతస్తుల్లో భవనం నిర్మిస్తున్నారు.

# పాపం... కొణతాల..

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)**

సీనియర్ మోస్ట్ లీడర్. థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా పేరున్న నేత.. గతంలో ఓసారి మంత్రి అయ్యారు. గత రెండేళ్లుగా అమాత్య యోగంపై తెగ ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆయన అంచనాలు తలకిందులు అవుతూ వస్తున్నాయి. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఆ పొలిటీషియన్ తన స్టైల్‌ను మార్చేశారన్న టాక్ వినిపిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పుడున్న పొలిటీషియన్లందరి కంటే ఆయన చాలా సీనియర్. ఒకప్పుడు జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పేవారు. 1989లోనే ఫస్ట్ టైమ్ కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత అదే సీటు నుంచి మరోసారి ఎంపీ అయ్యారు. ఇక 2004లో ఎమ్మెల్యే అయి ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఏకైక మంత్రిగా ఐదేళ్లు తన హవా నడిపించారు కొణతాల. ఇక 2009లో ఓడిపోవడంతో ఆయన పొలిటికల్ గ్రాఫ్ ఎత్తు పల్లాలు చూడాల్సి వచ్చింది. అప్పుడు గనుక కొణతాల గెలిచి ఉండి ఉంటే రాజకీయం వేరేగా ఉండేదని చెప్తుంటారు.2009లో ఓటమితో పదిహేనేళ్ల పాటు పొలిటికల్‌గా చాలా ఇబ్బందులను ఫేస్ చేశారు కొణతాల. అయితేనేం 2024లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలిచి మరీ కొణతాలకు సీటు ఇచ్చారు. అలా ఆయనకు తిరిగి ఎమ్మెల్యేగా చాన్స్ దక్కింది. అయితే ఒకప్పుడు విశాఖ జిల్లాలో సింగిల్ హ్యాండ్ గణేష్‌లాగా హవా నడిపించిన కొణతాల..ఇప్పుడు అందరిలానే ఎమ్మెల్యేగా ఉండిపోవాల్సి వచ్చింది. కానీ బ్యాక్ గ్రౌండ్ చూస్తే మాత్రం అయ్యో..అంత పెద్ద నాయకుడు ఇలా ఉండిపోయారేంటన్న చర్చ కూడా నడుస్తుంది.అయితే ఇప్పుడు జనసేనలో సీనియర్ మోస్ట్ లీడర్లలో అనకాపల్లి జిల్లాకు చెందిన కొణతాల రామకృష్ణ ఒకరు. ఈ క్రమంలో విశాఖ జిల్లాతో పాటు ఉత్తరాంధ్ర పాలిటిక్స్‌పై పూర్తి అవగాహన ఉన్న కొణతాలకు మంత్రి పదవి దక్కుతుందని అంతా ఊహించారు. పైగా బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిగా ఉన్నారాయన. ఆ సామాజికవర్గానికి 25 ఏళ్ల క్రితం చివరి సారిగా మంత్రి యోగం దక్కింది. మళ్లీ ఇంతవరకూ ఆ ఛాన్స్ రానే లేదు. దాంతో విశాఖలో అనేక నియోజకవర్గాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చూపించగల గవర సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. కానీ అది ఎందుకో కుదరలేదు.ఇక ఈ ఏడాది మధ్యలో మంత్రి వర్గ విస్తరణ జరగబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. దాంతో అనకాపల్లి జిల్లా నుంచి కొణతాల రామకృష్ణకు జనసేన కోటాలో మంత్రి పదవి ఖాయమని టాక్ నడుస్తోంది. ప్రస్తుతం జనసేనలో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చారు. పార్టీకి మరో మంత్రిపదవి దక్కితే అది నాగబాబుకు ఇస్తారనే చర్చ ఉండేది. అయితే ఒకే కులానికి ..ఒకే కుటుంబానికి అన్ని పదవులు ఇచ్చారన్న విమర్శలు ఫేస్ చేయాల్సి వస్తుందని జనసేన అధినాయకత్వమే..నాగబాబును మంత్రి చేయాలనుకున్న డెసిషన్‌ను వెనక్కి తీసుకున్నట్లు చెబుతుంటారు. దీంతో బీసీల నుంచి కీలక నేతకు మంత్రి పదవి ఇస్తే బాగుంటుందన్న ఆలోచన జనసేనలో ఉందని అంటున్నారు. పైగా గోదావరి జిల్లాల తర్వాత ఉత్తరాంధ్ర జిల్లాలలో జనసేనకు మంచి బలం ఉంది. ఆరు ఎమ్మెల్యే సీట్లను ఇక్కడ ఆ పార్టీ గెలుచుకుంది. ఫ్యూచర్ పాలిటిక్స్‌ను దృష్టిలో పెట్టుకుని కొణతాలకు మంత్రి పదవి ఇవ్వొచ్చన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.మంత్రి పదవి రేసులో కొణతాల ఉన్నారని చర్చ జరుగుతున్న వేళ..బడ్జెట్ సమావేశాలలో ఆయన ఏకంగా సీఎం చంద్రబాబు ఫ్యామిలీ మొత్తాన్ని పొగిడేశారు. చంద్రబాబు, లోకేశ్‌ను మాత్రమే కాదు భువనేశ్వరి, బ్రాహ్మణి, ఆఖరికి దేవాంశ్‌ను కూడా పొగడ్తలతో ముంచెత్తారు కొణతాల. ఒకే కుటుంబంలో అందరూ ప్రతిభావంతులే అని కొణతాల చెప్పుకొచ్చారు. ఈ మధ్య ఆ కుటుంబంలోని వారంతా వివిధ రంగాల్లో సత్తా చాటి అవార్డులు అందుకున్నారని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేసి చర్చకు తెరదీశారు. అయితే ఉన్నట్లుండి ఆయన చంద్రబాబు కుటుంబాన్ని మొత్తం పొగిడేయడం హాట్ టాపిక్ అవుతోంది. పైగా జనసేన ఎమ్మెల్యేగా ఉంటూ టీడీపీ వారి కంటే ఎక్కువగా బాబు కుటుంబాన్ని కొణతాల పొగడటం వెనక మంత్రి పదవి కోరికలు ఉన్నాయా అన్న చర్చ సాగుతోంది.కొణతాలకు మంత్రి పదవి ఇవ్వాలా? వద్దా? అనేది పవన్ నిర్ణయమని..కొణతాల చంద్రబాబును పొగిడింది మంత్రి అందుకోసమేనన్న ప్రచారం సరికాదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఏది ఏమైనా తన పొలిటికల్ ట్రాక్ రికార్డ్ లో ఎప్పుడూ రెబల్ స్టార్‌గా ఉన్న కొణతాల..గతంలో ఎప్పుడూ ఇంతలా ఎవరినీ పొగడలేదన్న చర్చ మాత్రం ఆసక్తికరంగా మారింది.

# శశికళ కొత్త పార్టీ...

**చెన్నై, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)**

తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు మొదలయ్యాయి. మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వి.కె. శశికళ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సొంత పార్టీని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అన్నాడీఎంకేలో తిరిగి చేరేందుకు ఆమె చేసిన ప్రయత్నాలను ఎడప్పాడి పళనిస్వామి వర్గం పూర్తిగా తిరస్కరించడంతో, ఆమె తన మద్దతుదారులతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జయలలిత జయంతి రోజైన ఫిబ్రవరి 24, 2026న రామనాథపురం సమీపంలో శశికళ తన కొత్త పార్టీ పేరు , జెండాను ఆవిష్కరించే అవకాశం ఉంది. 2021 ఎన్నికల్లో రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించిన ఆమె, ఈసారి మాత్రం సుమారు 40 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత అన్నాడీఎంకే నాయకత్వం ఎంజీఆర్ , జయలలిత ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, పార్టీని మళ్లీ గాడిలో పెట్టడమే తన ఉద్దేశమని ఆమె అనుచరులు పేర్కొంటున్నారు. అవినీతి కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవించిన శశికళకు ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో ఇప్పటికీ సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి.ఆమె అనర్హత కాలం వచ్చే ఏడాది ప్రారంభంలో ముగుస్తుంది, కాబట్టి ఆమె ఈ ఏడాది ఎన్నికల్లో నేరుగా పోటీ చేసే అవకాశం లేదు. అయినప్పటికీ, పార్టీని నడిపించడం , తన మద్దతుదారులను బరిలోకి దింపడం ద్వారా తన రాజకీయ బలాన్ని నిరూపించుకోవాలని ఆమె భావిస్తున్నారు. శశికళ కొత్త పార్టీ వల్ల ప్రధానంగా అన్నాడీఎంకే కే ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ తమిళనాడులో బలమైన పట్టున్న తేవర్ సామాజిక వర్గం ఓట్లు అన్నాడీఎంకే నుండి శశికళ వైపు మళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే విజయ్ పార్టీ ఎంట్రీతో తమిళ రాజకీయాలు వేడెక్కగా, ఇప్పుడు శశికళ రంగంలోకి రావడం వల్ల ఓట్లు మరింతగా చీలిపోనున్నాయి. ఇది పరోక్షంగా అధికార డీఎంకే కు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.శశికళ ప్రకటన అన్నాడీఎంకేలోని ఈపీఎస్ వర్గానికి పెద్ద సవాలుగా మారింది. ఇప్పటికే ఓ. పన్నీర్ సెల్వం, టీటీవీ దినకరన్ వంటి నేతలు విడిపోయి ఉన్న తరుణంలో, శశికళ సొంత కుంపటి పెట్టడం వల్ల పార్టీ సంస్థాగతంగా మరింత బలహీనపడవచ్చు. అవినీతిపరులను పార్టీలోకి చేర్చుకోము అని పళనిస్వామి గట్టిగా చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కేడర్ విడిపోవడం ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపవచ్చు. తమిళనాడు రాజకీయాల్లో ఈసారి ద్విముఖ పోరాటం కాకుండా, డీఎంకే కూటమి, అన్నాడీఎంకే కూటమి, విజయ్-శశికళ వంటి చిన్న పార్టీల మధ్య బహుముఖ పోటీ సాగనుంది. శశికళ కేవలం 40 సీట్లలోనే ప్రభావం చూపినప్పటికీ, అన్నాడీఎంకే గెలుపోటములను శాసించే శక్తిగా మారే అవకాశం ఉంది. జయలలిత వారసురాలిగా ఆమెకు ఉన్న గుర్తింపు ప్రజల్లో ఎంతవరకు పనిచేస్తుందనేది 2026 అసెంబ్లీ ఎన్నికలే తేల్చాలి.

# రాజకీయ రొచ్చులోకి హీరోయిన్లు

## తెలంగాణలో రకుల్..

## తమిళంలో త్రిష





**చెన్నై, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)**

అమ్మ, ఆలి, చెల్లి... ఆడవాళ్ళ ప్రస్తావన లేకుండా తిట్టు చూద్దాం అని ఓ సినిమాలో విలన్‌కు సవాల్ విసురుతాడు హీరో. ఇప్పుడు రాజకీయ నాయకులకు సైతం ఈ విధమైన సవాల్ విసరాలేమో!? హీరోయిన్లను అడ్డు పెట్టుకుని విమర్శలు వద్దని, కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కావాలని! ఎందుకంటే... తెలంగాణలో రకుల్ ప్రీత్ సింగ్, తమిళనాడులో త్రిషను కొందరు నేతలు తమ స్వార్థం కోసం రాజకీయాల్లోకి లాగుతూ ప్రత్యర్థి పార్టీ నాయకులను టార్గెట్ చేశారు.త్రిషకు, రాజకీయాలకు సంబంధం లేదు. ప్రత్యేక్షంగా ఎవరికీ, ఏ రాజకీయ పార్టీకి త్రిష మద్దతు ఇచ్చిన సందర్భాలు లేవు. కానీ, ఇప్పుడు తమిళ రాజకీయాలు ఆమె చుట్టూ తిరుగుతున్నాయి. అందుకు కారణం కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పార్టీ స్థాపించి రాజకీయాల్లోకి రావడం.తమిళ రాజకీయాల్లో తాను ఒంటరిగా పోటీ చేస్తానని దళపతి విజయ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో మిగతా రాజకీయ పార్టీలు ఆయనపై కత్తి కట్టాయి. అది సహజం. విజయ్ 'జన నయగన్' విడుదలకు అడ్డంకులు ఏర్పడ్డాయి. అందులో రాజకీయ కోణం చూస్తున్నారు కొందరు. నిజానిజాలు పక్కన పెడితే... విజయ్ వరకు సంబంధించిన వ్యవహారం అది.విజయ్ మీద విమర్శలు గుప్పించే క్రమంలో తమిళనాడు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఓ అడుగు ముందుకేసి... త్రిష ఇంటి నుంచి విజయ్ బయటకు రావాలని కామెంట్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై విజయ్ - త్రిష అభిమానులు, మహిళా సంఘాలు భగ్గుమన్నాయ్. తెలంగాణలోనూ ఈ విధమైన నీచ రాజకీయాలు ఇటీవల జరిగాయి.భారతీయ రాష్ట్ర సమితి నాయకుడు, కేసీఆర్ తనయుడు కల్వకుంట్ల తారక రామారావు (కేఆర్‌ఆర్)కు, కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్‌కు ముడి పెడుతూ విమర్శలు చేశారు, ఇంకా చేస్తున్నారు ప్రత్యర్థులు. ఆ మధ్య సమంత వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేలా విమర్శలు చేసి తర్వాత క్షమాపణలు చెప్పారు కొండా సురేఖ. తెలంగాణ రాజకీయ విమర్శల్లో అప్పుడప్పుడూ సురేఖా వాణి పేరూ వినిపిస్తూ ఉంటుంది. ఆ మధ్య తమిళనాడు రాజకీయాల్లో ప్రదీప్ రంగనాథన్ 'డ్రాగన్', విశ్వక్ సేన్ 'ఫంకీ' హీరోయిన్ కయాదు లోహర్ పేరు హైలైట్ అయ్యింది. ఎందుకు? రాజకీయాల్లో హీరోయిన్లను టార్గెట్ చేయడం ఎందుకు? ఇప్పుడు చిత్ర పరిశ్రమ నుంచి కాదు... సామాన్యుల నుంచి వ్యక్తం అవుతున్న ప్రశ్న. విలువలతో కూడిన రాజకీయాలను కొందరు ఎప్పుడో వదిలేశారు. కనీసం ఆడవాళ్లను తీసుకు రాకుండా రాజకీయాలు చేయలేరా? సినిమాల్లో విజయ్ - త్రిషది హిట్ పెయిర్. కొన్ని సినిమాలు చేసిన హీరో హీరోయిన్ల మధ్య పరిచయం ఉంటుంది. సినిమాల్లో ఉన్నట్టు బయట ఉంటారని విమర్శలు చేయడం ఎంత వరకు సబబు? అసలు రాజకీయాలతో సంబంధాలు లేని రకుల్ పేరు లాగడం ఎందుకు??తమిళనాడులో త్రిష... తెలంగాణలో రకుల్... రాజకీయాలకు సాఫ్ట్ టార్గెట్ కింద మారారు. సినిమాల్లో నటించడం, తమ పని ఏదో తాము చూసుకోవడం తప్ప ఈ తరహా రాజకీయ విమర్శలకు బదులు ఇవ్వరు. ఒకవేళ ఇస్తే మళ్ళీ మళ్ళీ వచ్చే రాజకీయ విమర్శలు అన్నిటికీ బదులు ఇవ్వవలసి ఉంటుంది. అందుకని, త్రిష - రకుల్ మౌనం వహిస్తున్నారు. విమర్శలను వాదిస్తున్నారు. దాంతో కొందరు రాజకీయ నాయకులు - వాళ్ళ అనుచరులకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో హీరోయిన్లపై వ్యక్తిత్వ దాడి కొనసాగిస్తోంది. దీనికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

# కొత్త బాధ్యతలతో జేడీ

**ఒంగోలు, ఫిబ్రవరి 17, (లక్ష్యం న్యూస్)**

జేడీ లక్ష్మీనారాయణ.. తెలుగు ప్రజలకు పరిచయం అక్కరలేని పేరు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి మరణానంతరం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్సార్ కొడుకు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై పెట్టిన అక్రమాస్తుల కేసు విచారణతో సీబీఐ డైరెక్టర్‌గా జేడీ లక్ష్మీనారాయణ గుర్తింపు పొందారు. తర్వాత ఉద్యోగం నుంచి స్వచ్ఛంద రిటైర్మెంట్ తీసుకున్న ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. పార్టీ పెట్టారు. 2019 ఎన్నికల్లో పార్టీ తరపున అభ్యర్థులను నిలిపి పోటీ చేశారు. కానీ అప్పటి వైసీపీ ధాటికి ఒక్క సీటు కూడా గెలవలేదు. తర్వాత విశ్లేషకుడిగా, మోటివేటర్‌గా కొనసాగుతూ వచ్చారు. మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్ అయిన లక్ష్మీనారాయణ ఇప్పుడు కొత్త ఉద్యోగంలో చేరారు. మేఘా ఇంజినీరింగ్ అనుబంధ సంస్థ ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నియామకాన్ని సంస్థ లింక్డ్ఇన్‌లో ప్రకటించింది.ఎన్ఐటీ వరంగల్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ బీటెక్, ఐఐటీ మద్రాస్‌లో ఎంటెక్ పూర్తి చేసిన ఆయన అశోక్ లేల్యాండ్ ఆర్ అండ్ డీలో కెరీర్ ప్రారంభించారు. 1990 బ్యాచ్ మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్‌గా ముంబైలో అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా ఉద్యోగ విరమణ చేశారు. 2006?13 మధ్య సీబీఐలో జగన్ అక్రమాస్తుల కేసు సహా హైప్రొఫైల్ దర్యాప్తులు చేపట్టారు.పదవీవిరమణ తర్వాత జనసేన పార్టీ తరఫు విశాఖపట్నం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2023లో జై భారత్ నేషనల్ పార్టీ స్థాపించారు. తూర్పు గోదావరి ధర్మవరంలో పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం కూడా చేశారు. కుమారుడు ఆల్ ఇండియా సర్వీసులో పనిచేస్తున్నారు.హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఈవీ ట్రాన్స్ దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్. తెలంగాణ ఆర్టీసీ ఒలెక్ట్రా బస్సులు, ముంబై, పుణే, గోవాలోని వాహనాలు తయారు చేస్తుంది. లక్ష్మీనారాయణ ఆర్థిక, కార్యాంగ నిర్వహణ అనుభవం సంస్థ విస్తరణకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే.. ఇటీవల లక్ష్మీనారాయణ భార్య ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్‌లో రూ.2.58 కోట్లు కోల్పోయారు. లాభాలు హామీ ఇచ్చి మోసం చేసినవారిపై జనవరిలో సైబర్ క్రై మ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

Printed,Published and owned by CHALLA MADHUSUDHANA RAO,and Printed at VEERENDRA GRAPHICSD.NO.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001. Guntur Dist, A.P. and Published at D.No.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001, Guntur Dist, A.P. R.N.I. No. APTEL/2013/48712 Editor : CHALLA MADHUSUDHANA RAO